
శనివారం 3, జనవరి 2026
https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు


## రాజధాని గ్రామాల అభివృద్ధిపై దృష్టి

- మంత్రి నారాయణ వెల్లడి



5

# చంద్రబాబు విజన్.. ఏపీ నెంబర్ వన్!






- పెట్టుబడుల ఆకర్షణలో రాష్ట్రం దూకుడు
- 25 శాతానికి పైగా సాధించి దేశంలోనే అగ్రస్థానం
- ఆర్థిక సంవత్సరం తొమ్మిది నెలల నివేదిక విడుదల
- 25.3 శాతం పెట్టుబడులతో టాప్‌లో ఏపీ
- రెండు, మూడు స్థానాల్లో ఒడిశా (13.1 శాతం), మహారాష్ట్ర (12.8 శాతం)
- ఆంధ్రప్రదేశ్ దూసుకెళుతోందని మంత్రి లోకేష్ హర్షం
- దేశాభివృద్ధికి రథసారథిగా రాష్ట్రం నిలిచిందని ఉద్ఘాటన
- సీఎం చంద్రబాబు వేగం, విధానాలే కారణమని స్పష్టం

*పెట్టుబడుల్లో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచాం. దేశంలోని మొత్తం పెట్టుబడుల్లో 25.3% వాటా ఏపీదే, ఒడిశా, మహారాష్ట్రను దాటి పారిశ్రామిక వృద్ధి సాధించాం. సీఎం చంద్రబాబు నేతృత్వంలో వేగం, స్థిరమైన నిర్ణయాలే ఏపీ విజయాలకు కారణం. పోర్టులు, పారిశ్రామిక కారిడార్లు, లాజిస్టిక్స్, ఎనర్జీ, డిజిటల్ రంగాల్లో మౌలిక వసతులపై ఏపీ దృష్టి. రెన్యువబుల్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్స్, డేటా సెటర్లు, మొబిలిటీ రంగాల్లో ఏపీకి భారీ పెట్టుబడులు. దేశంలోనే పెట్టుబడులకు ఏపీ కేంద్ర బిందువు*

- మంత్రి నారా లోకేష్




3

## మీ ఆలోచనలు వినూత్నం, అభినందనీయం

- కృష్ణా, పల్నాడు జిల్లాల కలెక్టర్లకు సీఎం చంద్రబాబు అభినందనలు

### నాడు జగన్‌ది పబ్లిసిటీ పిచ్చి..

## నేడు రాజముద్రతో పాస్ పుస్తకాలు

6

- రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం
- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

## విద్యుత్ వినియోగదారులకు ఊరట

- ప్రజలపై భారం పడకుంగా చర్యలు
- రూ. 4,492 కోట్ల ట్రూ అప్ ఛార్జీలు భరించనున్న కూటమి ప్రభుత్వం
- హామీలన్నీ అమలు చేస్తూ సీఎం చంద్రబాబు సుపరిపాలన
- ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నుకసాని బాలాజీ

5

## బ్రాహ్మణ సంక్షేమానికి కొత్త దిశ

- బుచ్చి రాంప్రసాద్

4



### ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం...

## భూ సమస్యల పరిష్కారం

- పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీపై టెలికాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు
- రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ..నూతన సంవత్సర కానుక
- గత ప్రభుత్వంలో నాటి సీఎం ఫొటోలతో భూమి హక్కు పత్రాలు
- ఎన్నికల హామీ మేరకు తాజాగా రాజముద్రతో పంపిణీకి శ్రీకారం
- రీ సర్వే పూర్తైన గ్రామాల పరిధిలో 22 లక్షల కొత్త పాస్ పుస్తకాల పంపిణీ
- తొలిరోజు రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేలు, మంత్రుల చేతుల మీదుగా అందజేత
- ఈ నెల 9వ తేదీ వరకు కార్యక్రమం
- తాను కూడా ఒకరోజు పాల్గొంటానన్న సీఎం చంద్రబాబు

- వివరాలు 2లో..

## భూ సంబంధిత సేవలన్నీ సరళీకృతం



- సమస్యలకు తక్షణ పరిష్కారం
- రైతులకు ఇబ్బందులు లేకుండా రాజముద్రతో పాస్ పుస్తకాలు
- 22 ఏ జాబితా నుండి పట్టా భూములకు విముక్తి
- రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టీకరణ
- రాజముద్రతో పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీని ప్రారంభించిన మంత్రి

- వివరాలు 2లో..

### పోర్టు, పరిశ్రమలు, పర్యాటకాన్ని

## అనుసంధానిస్తూ రోడ్ల విస్తరణ



- అమరావతిని కలుపుతూ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు
- మచిలీపట్నం హైవే ఆరు వరుసలుగా విస్తరణ
- అండర్ పాస్‌లు, డ్రైనేజీ సమస్యలు తీరుస్తాం
- ఉమ్మడి కృష్ణా జిల్లాలోని నేషనల్ హైవేల సమస్యలకు త్వరలో పరిష్కారం
- మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి
- ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రజాప్రతినిధుల సమావేశం

- వివరాలు 7లో...

## ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం...

# భూ సమస్యల పరిష్కారం

- పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీపై టెలీకాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు
- రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ నూతన సంవత్సర కానుక
- గత ప్రభుత్వంలో నాటి సీఎం ఫొటోలతో భూమి హక్కు పత్రాలు
- ఎన్నికల హామీ మేరకు తాజాగా రాజముద్రతో పంపిణీకి శ్రీకారం
- రీ సర్వే పూర్తైన గ్రామాల పరిధిలో 22 లక్షల కొత్త పాస్ పుస్తకాల పంపిణీ
- తొలిరోజు రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేలు, మంత్రుల చేతుల మీదుగా అందజేత
- ఈ నెల 9వ తేదీ వరకు కార్యక్రమం
- తాను కూడా ఒకరోజు పాల్గొంటానన్న సీఎం చంద్రబాబు

అమరావతి (చైతన్యరథం): రాజముద్రతో అన్నదాతలకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ.. నూతన సంవత్సర కానుకగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. రాష్ట్ర వ్యాప్తంగా పట్టాదారు పాసుపుస్తకాల పంపణీపై శుక్రవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా మంత్రులతో సీఎం సమీక్ష నిర్వహించారు. పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రికి రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ వివరించారు. ఈ సందర్భంగా మంత్రులకు సీఎం చంద్రబాబు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ...ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ప్రభుత్వం నెరవేరుస్తోందన్నారు. గత ప్రభుత్వ తప్పిదాలతో ప్రతి గ్రామంలో రెవెన్యూ సమస్యలు ప్రజలను పట్టిపీడిస్తున్నాయి. వివాదాలు లేని స్థలాలను కూడా రీ సర్వే పేరుతో అడ్డదిడ్డంగా చేసి వివాదాస్పదం చేశారు. తాము అధికారంలోకి రాగానే రీ సర్వే చేసి తప్పులను సరిదిద్ది కొత్త పాసుపుస్తకాలు ఇస్తామని హామీ ఇచ్చామని ప్రస్తావించారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినట్లుగానే రాజముద్రతో కొత్త పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీకి శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు.

భూమే ప్రాణంగా బతికే రైతులకు భూ సమస్యలు లేకుండా చేయడం మన లక్ష్యం. గత ప్రభుత్వం అసంబద్ధంగా తెచ్చిన ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దుతో ప్రజల్లో అభద్రతను తొలగించాం. పాస్ పుస్తకాలపై జగన్ బొమ్మలకు నాటి పాలకులు రూ.22 కోట్లు తగలేశారు. నేడు పాసుపుస్తకాల పంపిణీ ప్రతి ఇంట్లో కొత్త సంతోషాన్ని తెస్తోంది. ప్రజలకు భూ వివాదాలు లేకుండా చేయడం అనేది ప్రథమ కర్తవ్యం కావాలి. నిర్దిష్ట సమయాన్ని లక్ష్యంగా పెట్టుకుని పనిచేయాలి. మంత్రులు, జిల్లా కలెక్టర్లు ఈ విషయంలో ఎక్కువ చొరవ తీసుకోవాలి.



రీ సర్వే పూర్తైన గ్రామాల పరిధిలో 22 లక్షల కొత్త పాసుపుస్తకాల పంపిణీని ప్రారంభించాం. జనవరి 2వ తేదీ నుంచి 9వ తేదీ వరకు పాసు పుస్తకాలు పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. తొలిరోజు రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేలు, మంత్రుల చేతుల మీదుగా పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశాం. వేలాది గ్రామాల్లో సంబరంగా పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ మొదలైంది. జగన్ బొమ్మతో ఉన్న పాసు పుస్తకాల స్థానంలో రాజముద్ర ఉన్న వాటిని పంపిణీ చేస్తోండటంతో ప్రజల నుంచి సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో తాను కూడా ఒకరోజు పాల్గొంటానని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

# భూ సంబంధిత సేవలన్నీ సరళీకృతం

- సమస్యలకు తక్షణ పరిష్కారం
- భూ సంబంధిత సేవలన్నీ సరళీకృతం
- రైతులకు ఇబ్బందులు లేకుండా రాజముద్రతో పాస్ పుస్తకాలు
- 22 ఏ జాబితా నుండి పట్టా భూములకు విముక్తి
- రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టీకరణ
- రాజముద్రతో పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీని ప్రారంభించిన మంత్రి



వేమూరు (చైతన్యరథం): భూమికి సంబంధించిన సేవలన్నీ సరళీకృతం అయ్యాయని, భావి తరాల వారు భూ సమస్యలతో ఇబ్బందులు ఉండరాదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రాజముద్రతో నూతనంగా ప్రచురించిన రీ సర్వే పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమం బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం కొల్లూరు మండలం దోనేపూడి గ్రామంలో శుక్రవారం జరిగింది. దోనేపూడి గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమాన్ని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. తొలుత రెవెన్యూ అధికారులు ఏర్పాటుచేసిన రెవిన్యూ దస్త్రాల ప్రదర్శనశాలను మంత్రి సత్యప్రసాద్, బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్, వేమూరు శాసనసభ్యుడు నక్కా ఆనందబాబు, సీసీఎల్ఏ ముఖ్య కమిషనర్ జయలక్ష్మి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, జిల్లా సంయుక్త కలెక్టర్ భావన విశిష్ట కలిసి పరిశీలించారు. జి ఆశీర్వాదం, నాగ కిషోర్ భూముల వివరాలను ఆన్ లైన్ లో పరిశీలించారు. దోనేపూడి గ్రామంలో రీ సర్వే పూర్తిగా ముగిసినందున జిల్లా స్థాయి కార్యక్రమానికి ఈ గ్రామంలో శ్రీకారం చుట్టారు.

### రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా..

ఈ సందర్భంగా మంత్రి అనగాని మాట్లాడుతూ రైతులంతా సుభిక్షంగా ఉండాలనే ఏకైక ధ్యేయంతో రాష్ట్ర ప్రభుత్వం సుపరిపాలనను అందిస్తోందని చెప్పారు. రాష్ట్రంలో 17,500 రెవిన్యూ గ్రామాలు ఉండగా, క్షేత్రస్థాయిలో భూ వివాదాలు అధికంగా ఉన్నాయన్నారు. భూ సమస్యలు, గొడవలు పరిష్కరించడానికే కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. భావితరాల ప్రజలు భూ సమస్యలతో ఇబ్బందులు పడకుండా ఉండడానికి, పేద ప్రజలు క్షేమంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చారన్నారు. గ్రామాలు బాగుండాలి, అభివృద్ధిలోకి రావాలనే లక్ష్యంతో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. విద్యా రంగాన్ని సరిచేస్తూ.. లక్షలాది మంది యువతకు ఉపాధి కల్పించే దిశగా విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేష్ కృషి చేస్తున్నారని వివరించారు. గ్రామ సభలు, రెవిన్యూ సదస్సులలో ప్రజల నుంచి వచ్చిన రెండు లక్షలకు పైగా వచ్చిన ఫిర్యాదులను అధ్యయనం చేసి పరిష్కరించామన్నారు. రీ సర్వేను సమర్ధంగా నిర్వహిస్తూ భూమి దస్త్రాలలో అవకతవకలను పూర్తిగా అరికడుతున్నామన్నారు. 22 ఏ లో నుంచి పట్టా భూములను తొలగించి, రైతులకు పూర్తిగా హక్కు పత్రాలు అందిస్తున్నామని వివరించారు. భూమికి సంబంధించిన సేవలన్నీ సరళతరం అవుతున్నాయన్నారు. చుక్కల భూమిలో నుంచి పట్టా భూములను తొలగిస్తున్నామన్నారు.

### లంచం అడిగితే ఫిర్యాదు చేయండి

ప్రభుత్వ కార్యాలయాలలో లంచం అడిగినా,... అధికారులు తప్పు చేసినా ప్రజలు ఎవరైనా ఫిర్యాదులు చేయవచ్చని మంత్రి సత్యప్రసాద్ తెలిపారు. తప్పు చేసినట్లు రుజువైతే వారిపై కఠిన చర్యలు ఉంటామని, అవసరమైతే వారిని ఉద్యోగాల నుంచి పూర్తిగా తొలగిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో పారదర్శకతతో పాలన సాగుతోందని వివరించారు. రైతులకు మంచి జరగాలనే ఉద్దేశంతో ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్లను వారి భూమికి అనుసంధానిస్తూ సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను సమర్ధంగా అమలు చేస్తున్నామన్నారు. 18 నెలల కూటమి పాలనలో 42 కార్యక్రమాలు అమలు చేశామని, సూపర్ సిక్స్ ప్రకటించినప్పటికీ సూపర్ 18 అమలు చేయడంతో గ్రామాల ప్రజలలో సంతోషం వెల్లివిరుస్తోందన్నారు. గ్రామాలలోనూ అన్న క్యాంటీన్లు ప్రారంభించడానికి సీఎం చర్యలు తీసుకుంటున్నారన్నారు. పెట్టుబడిదారులను సమీకరించడం ద్వారా పరిశ్రమలు వస్తున్నాయని, భావితరాలకు నిరుద్యోగ సమస్య తీరుతుందన్నారు. రాష్ట్రంలో 13 లక్షల ఉద్యోగ అవకాశాలు యువతకు వస్తున్నాయని, రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. విద్యుత్ బిల్లులో ఒక యూనిట్‌కు 13 పైసలు తగ్గించడం ద్వారా ప్రజలకు భారీ మేలు జరిగిందని మంత్రి అనగాని వివరించారు.

### కూటమి పాలనలో రైతులకు మేలు: ఎంపీ కృష్ణప్రసాద్

భూమి సమస్యలు, మోసాలను అరికడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అధునాతన వ్యవస్థను ప్రవేశపెట్టడం అభినందనీయమని బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ అన్నారు. భారతదేశంలో ఎక్కడా లేని అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రెవెన్యూ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. దీంతో భూ సమస్యలన్నీ పరిష్కారం అవుతున్నాయన్నారు. అధికారులు ప్రజల కోసం పనిచేయాలి, పారదర్శకంగా సేవలందించాలన్నారు. రైతుల జీవితాల్లో ఆనందం నింపడానికే రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. పట్టాదారు పాస్ పుస్తకంలో రైతుల భూమి వివరాలు స్పష్టంగా ఉన్నాయన్నారు. కూటమి పాలనలో రైతులకు మేలు జరుగుతోందన్నారు.

### రైతుల సమస్యలకు పరిష్కారం: ఎమ్మెల్యే ఆనందబాబు

రాజ ముద్రతో రీ సర్వే పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వడం సంతోషదాయకమని వేమూరు శాసనసభ్యుడు నక్కా ఆనందబాబు చెప్పారు. భూమిపై తరతరాల వారసత్వ హక్కు ప్రజలకు ఉంటుందని, అలాంటి అనుబంధం ఉన్న భూ సమస్యలతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అలాంటి భూ సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుందన్నారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవడం మంచి పద్ధతి కాదని, రెవిన్యూశాఖలో క్షేత్రస్థాయి సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఎన్నో ఏళ్లుగా రైతులు ఎదురుచూస్తున్న భూ సమస్యలకు ఇప్పుడు పరిష్కారం దొరుకుతోందన్నారు. జిల్లా స్థాయి కార్యక్రమం దోనెపూడి గ్రామంలో నిర్వహించడం సంతోషదాయకమన్నారు.

రెవిన్యూ శాఖ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికే ప్రభుత్వం కృషి చేస్తోందని సిసిఎల్ఏ ముఖ్య కమిషనర్ జయలక్ష్మి తెలిపారు. ప్రభుత్వం అందించే సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆన్ లైన్‌లో రెవిన్యూ దస్త్రాల ద్వారా 5 సేవలు గ్రామ సచివాలయాల వద్దనే పొందవచ్చన్నారు. రానున్న జులై నుంచి భూమి రిజిస్ట్రేషన్ పూర్తికాగానే ఆన్లైన్ ద్వారానే వన్ బి అడంగల్‌లో వాటంతట అవే పేర్లు మార్పు జరుగుతాయన్నారు. పారదర్శకంగా రెవెన్యూ సేవలు ప్రజలకు అందిస్తున్నామన్నారు. రీ సర్వే పూర్తయిన గ్రామాలలో రాజముద్రతో పట్టాదారు పాసు పుస్తకాలు ఇస్తున్నామన్నారు. ఆ పుస్తకాలలో క్యూఆర్ కోడ్ ఉంటుందని, తద్వారా రైతులు తమ భూమి వివరాలు, మ్యాపు, సరిహద్దులు చూసుకునే వెసులుబాటు ఉందన్నారు. అత్యంత పారదర్శకంగా ప్రభుత్వ సేవలు పొందచ్చని వివరించారు. ఈ కేవైసీ ద్వారా పాసు పుస్తకాలు ఇస్తున్నామన్నారు.

రీ సర్వేతో భూ సమస్యలన్నీ సంపూర్ణంగా పరిష్కారం అవుతున్నాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని రెవెన్యూ శాఖ మంత్రి తొలి కార్యక్రమం కొల్లూరు మండలంలో జరపడం సంతోషదాయకం అన్నారు. భూముల వివరాలన్నీ వెబ్ ల్యాండ్ ద్వారా అందుబాటులోకి వచ్చాయన్నారు. 22 ఏ నుంచి పట్టా భూములను తొలగించే ప్రక్రియను ప్రణాళికతో చేపట్టామన్నారు. రెవిన్యూ క్లినిక్ కార్యక్రమాలు సోమవారం నుంచి జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తామన్నారు. అలాగే పీజీఆర్ఎస్ ద్వారా ప్రజల సమస్యలన్నీ పూర్తిగా పరిష్కరిస్తున్నామన్నారు.

## చంద్రబాబు విజన్..

# ఏపీ నెంబర్ వన్!

- పెట్టుబడుల ఆకర్షణలో రాష్ట్రం దూకుడు
- 25 శాతానికి పైగా సాధించి దేశంలోనే అగ్రస్థానం
- ఆర్థిక సంవత్సరం తొమ్మిది నెలల నివేదిక విడుదల
- 25.3 శాతం పెట్టుబడులతో టాప్‌లో ఏపీ
- రెండు, మూడు స్థానాల్లో ఒడిశా (13.1 శాతం), మహారాష్ట్ర (12.8 శాతం)
- ఆంధ్రప్రదేశ్ దూసుకెళుతోందని మంత్రి లోకేష్ హర్షం
- దేశాభివృద్ధికి రథసారథిగా రాష్ట్రం నిలిచిందని ఉద్ఘాటన
- సీఎం చంద్రబాబు వేగం, విధానాలే కారణమని స్పష్టం




అమరావతి (చైతన్యరథం): దేశంలో పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్రప్రదేశ్ దూసుకెళుతోంది. ఈ రంగంలో ఏపీ అత్యంత దూకుడు చూపిస్తోందని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. బ్యాంక్ ఆఫ్ బరోడా తాజా నివేదికలో పెట్టుబడుల సాధనలో దేశంలోనే ఏపీ నెంబర్ వన్‌గా నిలిచింది. ఈ నివేదికను ప్రస్తావిస్తూ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో మంత్రి నారా లోకేష్ పోస్ట్ పెట్టారు. ఆంధ్రప్రదేశ్ ముందుకు దూసుకువెళుతోంటూ సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల్లో దేశంలోని మొత్తం పెట్టుబడుల్లో 25.3 శాతం వాటాతో ఏపీ అగ్రస్థానంలో నిలిచిందని హర్షం వ్యక్తం చేశారు.

13.1 శాతంతో ఒడిశా, 12.8శాతంతో మహారాష్ట్ర రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. దేశం మొత్తం పెట్టుబడుల్లో 51.2 శాతం ఈ మూడు రాష్ట్రాలు సాధించాయి. దేశవ్యాప్తంగా పెట్టుబడి ప్రకటనలు 26.6 లక్షల కోట్లని నివేదికలో పేర్కొన్నారు. గత ఏడాదితో పోలిస్తే దేశవ్యాప్తంగా 11.5 శాతం వృద్ధి కనిపించింది. వేగవంతమైన నిర్ణయాలు, స్థిరమైన విధానాలే ఏపీ విజయానికి కారణమని మంత్రి లోకేష్ తెలిపారు. పోర్ట్‌లు, ఇండ్రస్ట్రియల్ కారిడార్లు, లాజిస్టిక్స్, ఎనర్జీ, డిజిటల్ మౌలిక వసతులపై ఏపీ దృష్టి సారించిందని పేర్కొన్నారు.

రాష్ట్రంలో అనుకూలమైన పారిశ్రామిక విధానాలు, మౌలిక సదుపాయాల కల్పన, సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం చూపుతున్న చొరవ, వేగం వల్ల గ్లోబల్ ఇన్వెస్టర్లు ఏపీ వైపు మొగ్గు చూపుతున్నారని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో ఏపీ ఇతర రాష్ట్రాల కంటే ముందుంది. బ్యాంక్ ఆఫ్ బరోడా తాజా నివేదిక ప్రకారం, దేశం మొత్తమ్మీద ప్రతిపాదిత పెట్టుబడుల్లో 25.3 శాతం వాటాతో దేశంలో పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్ తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. ఇది దేశ పారిశ్రామిక, పెట్టుబడుల ప్రస్థానం తూర్పు, దక్షిణ కారిడార్ల వైపు మళ్లుతున్న నిర్ణయాత్మక మార్పును సూచిస్తుంది. పెట్టుబడుల్లో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచాం. ఒడిశా, మహారాష్ట్రను దాటి పారిశ్రామిక వృద్ధి సాధించాం. వేగం, స్థిరమైన నిర్ణయాలే ఏపీ విజయాలకు కారణం. పోర్టులు, పారిశ్రామిక కారిడార్లు, లాజిస్టిక్స్, ఎనర్జీ, డిజిటల్ రంగాల్లో మౌలిక వసతులపై ఏపీ దృష్టి సారించింది.

మ్యాన్యుఫ్యాక్చరింగ్, రెన్యువబుల్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్స్, డేటా సెటర్లు, మొబిలిటీ రంగాల్లో ఏపీకి భారీ పెట్టుబడులు వస్తున్నాయి. దేశంలోనే పెట్టుబడులకు ఏపీ కేంద్ర బిందువుగా మంత్రి లోకేష్ అభివర్ణించారు. కనెక్టివిటి, ఫ్రెండ్లీ పాలసీలు కలిగి ఉండటంతోనే ఏపీ తొలి ఎంపికగా మారిందని వెల్లడించారు. భారతదేశ పారిశ్రామిక అభివృద్ధికి ఏపీ రథసారథిగా నిలిచిందని పేర్కొన్నారు.

జాతీయ పెట్టుబడులలో రాష్ట్ర వాటా పెరుగుతున్నది. స్థిరమైన సంస్కరణలు, నిర్ణయాల్లో వేగం, పెట్టుబడిదారుల పట్ల స్పష్టమైన నిబద్ధతకు ఫలితమే ఈ విజయం. మా విధానాలు స్పష్టంగా ఉన్నాయి. పెట్టుబడిదారులతో దీర్ఘకాలిక, సుస్థిర భాగస్వామ్యాలను కొనసాగించటం. అత్యంత వేగంగా క్షేత్రస్థాయిలో కార్యాచరణకు వీలైన వాతావరణాన్ని సృష్టించడం. ఉద్యోగ సృష్టికి ప్రాధాన్యత ఇవ్వటం. పెట్టుబడుల ప్రకటనను వీలైనంత త్వరగా ఆన్–గ్రౌండ్ ప్రాజెక్టులుగా మారేలా చూడటం తమ విధానమని స్పష్టం చేశారు. ప్రతి పెట్టుబడి ప్రకటన.. పరిశ్రమగా, ఉద్యోగాలుగా, మన ప్రజలకు ఆర్థిక అవకాశాలుగా మారాలనేదే తమ ధ్యేయమన్నారు.




## సీఎం చంద్రబాబు సామర్థ్యానికి నిదర్శనం


### - మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి

దేశంలో పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలవడంపై హర్షం రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి హర్షం వ్యక్తంచేశారు. దేశంలో పెట్టుబడులకు గమ్య స్థానంగా ఆంధ్రప్రదేశ్ నిలవడం కూటమి ప్రభుత్వ పనితీరు, చంద్రబాబు సామర్థ్యానికి,నాయకత్వ పటిమ కు దక్కిన విజయమన్నారు. ఈఆర్థిక సంవత్సరం తొలి 9 నెలల్లో దేశంలోకి వచ్చిన పెట్టుబడుల్లో 25.3% ఆకర్షించి అగ్రస్థానంలో నిలవడం.. ఆంధ్రప్రదేశ్ సాధిస్తున్న ఆర్థిక అభివృద్ధికి నిదర్శనం. దేశంలో పెట్టుబడుల్లో 4వంతు వాటాను సాధించడం జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులకు రాష్ట్రం లోని చంద్రబాబు నాయకత్వంపై ఉన్న విశ్వాసానికి నిదర్శనం. సుస్థిరమైన, నమ్మకమైన, సమర్థవంతమైన కూటమి ప్రభుత్వ పనితీరే రాష్ట్రానికి పెట్టుబడులను తీసుకొస్తోంది. ఐటీ శాఖ మంత్రిగా యువనేత లోకేష్ నాయకత్వంలో విశాఖ ఐటీ హబ్‌గా ఎదిగేందుకు వేగవంతంగా అడుగులు పడుతున్నాయి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ స్థానంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడా నికి ముందుకు వచ్చే సంస్థలకు అన్ని విధాలుగా సహా య సహకారాలు అందిస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌ను దేశా నికి పెట్టుబడుల హబ్‌గా తీర్చిదిద్దాలనే సంకల్పంతో.. విశాఖ సిఐఐ సదస్సును ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసు కుని నిర్వహించాం. సీఐఐ సమ్మిట్‌లో 610 ఒప్పం దాల ద్వారా రూ. 13.25లక్షల కోట్ల పెట్టుబడులు, 16.13 లక్షల ఉద్యోగాలు రావడం రాష్ట్ర చరిత్రలో ఒక సరికొత్త అధ్యాయం. సీఐఐ సదస్సులో ఒక్క ఐ అండ్ ఐ శాఖలోని మారిటైమ్ బోర్డు, ఏపీ ఎయిర్ పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఏపీ సైన్స్ సిటీలతో 40సంస్థలు ఎంవోయూలు కుదుర్చుకున్నాయి.తద్వారా దాదాపు 1.96లక్షల కోట్ల పెట్టుబడులు, 4.5లక్షల మందికి దక్కనున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రానున్నాయని మంత్రి జనార్దన్‌రెడ్డి తెలిపారు.

## మీ ఆలోచనలు వినూత్నం, అభినందనీయం

- కృష్ణా, పల్నాడు జిల్లాల కలెక్టర్లకు సీఎం చంద్రబాబు అభినందనలు

అమరావతి (చైతన్యరథం): నూతన సంవత్సర శుభాకాంక్షలను విద్యార్థులకు ఉపయోగపడేలా మలిచిన కృష్ణా జిల్లా, పల్నాడు జిల్లా కలెక్టర్లను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. పలు జిల్లాల్లో కలెక్టర్లు ఇలా వినూత్న ఆలోచనలతో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించ డాన్ని ముఖ్యమంత్రి అభినందించారు.



కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ చొరవతో జిల్లాలోని బాలికల సంక్షేమ వసతిగృహాలకు శానిటరీ నాప్కిన్ ఇన్సినిరేటర్లు సమకూరాయి. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపే సందర్భంగా అనవసరపు ఖర్చు చేయకుండా ఇతరులకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ ఇటీవల చేసిన సూచనకు జిల్లా అధికార యంత్రాంగం స్వచ్ఛందంగా సహకరించింది. గుర్తించిన అవసరాలకు అనుగుణంగా ఇన్సినిరేటర్లు, విద్యార్థులు కూర్చు నేందుకు చిన్న బల్లలను వివిధ శాఖల అధికారులు సమకూర్చారు. నూతన సంవత్సర కానుకలుగా ఒక్కోటి రూ. 12,500 చేసే 48 ఇన్సినిరేటర్లు, 972 చిన్న బల్లలను హాస్టళ్ల అధికారులకు కలెక్టర్ అందజేశారు. వీటిని సమకూర్చిన సిబ్బందిని అభినందించారు.

అదే విధంగా పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా... తనకు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చేవారు పుస్తకాలు తీసుకురావాలని చెప్పారు. దీంతో కలెక్టరేట్ సిబ్బంది,ఇతరులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ విద్యా సామగ్రి, పోటీ పరీక్షల పుస్తకాలు,రాత పుస్తకాలు,నిఘంటువులను బహుమతిగా అందించారు.వీటిని వసతిగృహాల విద్యార్థులకు, గ్రంథాలయాలకు అంద జేస్తామని కలెక్టర్ కృతికా శుక్లా చెప్పారు. వీరి వినూత్న ఆలోచనలను ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు.

# బ్రాహ్మణ సంక్షేమానికి కొత్త దిశ

రాజకీయాల్లో సంక్షేమం అంటే చాలామందికి హామీలు, ప్రకటనలు, నినాదాలే గుర్తుకు వస్తాయి. కానీ ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చినప్పుడే నిజమైన సంక్షేమం అనే దానికి అర్థం ఉంటుంది. ఆ మార్పును పాలనగా మార్చగలిగిన నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. ఆయన నాయకత్వంలో రాష్ట్రంలో అమలవుతున్న బ్రాహ్మణ సంక్షేమ కార్యక్రమాలు, ఒక సమాజానికి కేవలం సహాయం కాదు, గౌరవం, భరోసా, భవిష్యత్తుపై నమ్మకాన్ని అందిస్తున్నాయి.

బ్రాహ్మణ సమాజాన్ని రాష్ట్ర సామాజిక, సాంస్కృతిక వ్యవస్థలో కీలక భాగంగా భావిస్తూ, వారి అవసరాలను లోతుగా అర్థం చేసుకున్న పాలననే చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అందిస్తోంది. ఆర్థిక భద్రత, వృత్తి పరిరక్షణ, సామాజిక గౌరవం.. ఈ మూడు స్తంభాలపై నిర్మితమైన ఈ సంక్షేమ దృక్పథమే గడచిన ఏడాది పాలన ప్రత్యేకత.

### ఫలితాలే చంద్రబాబు పాలనకు నిజమైన సర్టిఫికెట్

2025-26 ఆర్థిక సంవత్సరంలో బ్రాహ్మణ కో-ఆపరేటివ్ సొసైటీ ద్వారా ఈ డిసెంబర్ వరకు రూ.93.04 కోట్ల రుణాలు బ్రాహ్మణ బంధువులకు అందాయి. ఇది సంఖ్యల రూపంలో కనిపిస్తున్న పాలనా విజయం మాత్రమే కాదు, వేలాది కుటుంబాల్లో ఏర్పడిన ఆర్థిక స్థిరత్వానికి స్పష్టమైన సాక్ష్యం. మహిళల సాధికారతకు పెద్దపీట వేస్తూ అమలవుతున్న అరుంధతి సూక్ష్మ రుణ పథకం ద్వారా 5,769 మంది బ్రాహ్మణ మహిళలకు రూ.19.82 కోట్లు అందాయి, ఈ పథకం మహిళలను ఆర్థికంగా మాత్రమే కాదు, సామాజికంగా కూడా బలోపేతం చేసింది. వశిష్ట సూక్ష్మ రుణ పథకం ద్వారా 876 మంది బ్రాహ్మణ పురుషులకు రూ.9 కోట్ల రుణాలు మంజూరవడం ద్వారా చిన్న వ్యాపారాలు, స్వయం ఉపాధి కార్యక్రమాలు ఊపందుకున్నాయి. సంప్రదాయ వృత్తులకు గౌరవం ఇస్తూ అమలవుతున్న పురోహిత మిత్ర పథకం ద్వారా 2,564 మంది అర్చకులు, పురోహితులకు రూ.14.82 కోట్ల ఆర్థిక సహాయం అందించడం చంద్రబాబు పాలనలో వృత్తి ఆధారిత సంక్షేమానికి ఉన్న ప్రాధాన్యతను స్పష్టంగా చూపిస్తోంది. ప్రభుత్వ దేవాలయాల అర్చకులు, చిన్న వ్యాపారులు, గృహ మరమ్మతుల అవసరాలున్న పేద కుటుంబాలు, ప్రైవేట్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల వరకు విభిన్న వర్గాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన ఈ పథకాలు మొత్తం మీద రూ.93.04 కోట్లకు చేరుకోవడం విశేషం.

### బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రత్యేక రోడ్ మ్యాప్

సంక్షేమ కార్యక్రమాలపై బ్రాహ్మణ సమాజం ఉంచిన విశ్వాసానికి నిదర్శనంగా, ఈ ఏడాది కాలంలోనే రూ.57.17 కోట్ల మెంబర్‌షిప్ డిపాజిట్లు సేకరించారు. ఇది చంద్రబాబు ప్రభుత్వం తీసుకొస్తున్న విధానాలపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తోంది. ఇక భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని బ్రాహ్మణ సంక్షేమాన్ని మరింత విస్తరించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. బ్రాహ్మణ బాలురకు ఉచిత సామూహిక ఉపనయన పథకం, పేద బ్రాహ్మణ కుటుంబాల్లో మరణించిన వారి అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందించే గరుడా పథకం వంటి ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయి. ఇవి అమల్లోకి వస్తే సంక్షేమ పరిధి మరింత విస్తరించనుంది. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను గెజిట్ ఉత్తర్వుల ద్వారా అమలు చేయడంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం చూపుతున్న నిబద్ధత ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ధూప-దీప-నైవేద్యం (డీడీఎన్ఎస్) పథకం కింద అర్చకుల వేతనాల పెంపు, నిరుద్యోగ వేద పండితులకు నెలవారీ భృతి, దేవాలయ ట్రస్ట్ బోర్డుల్లో బ్రాహ్మణులకు ప్రాతినిధ్యం వంటి నిర్ణయాలు ఈ పాలన విశ్వసనీయతకు ఉదాహరణలు. ఈ మొత్తం ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా బ్రాహ్మణ సమాజంలో రాజకీయ అవగాహనను, పాలనపై విశ్వాసాన్ని పెంచింది. సంక్షేమం అంటే దయ కాదు, హక్కు అనే భావన బలపడుతోంది. సంక్షేమాన్ని నినాదంగా కాకుండా ఒక వ్యవస్థగా అమలు చేయడమే చంద్రబాబు పాలన సారాంశం.

ఆర్థిక భద్రత, వృత్తి గౌరవం, సామాజిక ప్రాతినిధ్యం.. ఈ మూడింటిని సమన్వయం చేస్తూ బ్రాహ్మణ సమాజానికి మెరుగైన సంక్షేమాన్ని అందిస్తున్న నాయకత్వానికి ఇది స్పష్టమైన ఉదాహరణ. పాలన ఫలితాల రూపంలో కనిపించినప్పుడే అది చరిత్రలో నిలుస్తుంది. చంద్రబాబు పాలన అదే దిశగా సాగుతోంది.

- కె. బుచ్చి రాంప్రసాద్
బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్
ఆంధ్రప్రదేశ్

# భాషాభివృద్ధికి ప్రపంచ తెలుగు మహాసభలు!

**(3-4-5 తేదీలలో గుంటూరులో జరిగే ప్రపంచ తెలుగు మహాసభలు సందర్భంగా)**

గుంటూరు వేదికగా జరగనున్న ప్రపంచ తెలుగు మహాసభలు కేవలం ఒక సాంస్కృతిక కార్యక్రమం మాత్రమే కాదు. ఇవి తెలుగు భాషకు, తెలుగు జాతికి, తెలుగు ఆత్మగౌరవానికి జరిగే మహోత్సవం. తెలుగు భాషను మరోసారి ప్రపంచ వేదికపై వెలుగు నింపే చారిత్రక సందర్భం. తెలుగు భాష వేల సంవత్సరాల చరిత్ర, సాహిత్య సంపద. ప్రపంచీకరణ యుగంలో అనేక భాషలు తమ గుర్తింపును కోల్పోతున్న సమయంలో, తెలుగు మాత్రం తన శక్తిని మరింత పెంచుకుంటూ ముందుకు సాగుతోంది. ప్రపంచంలో అత్యధికంగా మాట్లాడే భాషలలో తెలుగు ఒకటిగా నిలవడమే కాకుండా, అమెరికా నుంచి ఆస్ట్రేలియా వరకు విస్తరించిన తెలుగు వలస సమాజాల ద్వారా అంతర్జాతీయ గుర్తింపు సాధిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రపంచ తెలుగు మహాసభలు భాషను ప్రపంచానికి మరోసారి పరిచయం చేసే వేదికగా నిలవనున్నాయి. టెక్నాలజీ, కృత్రిమ మేధ, డిజిటల్ కమ్యూనికేషన్ రంగాల్లో తెలుగుకు మరింత స్థానం కల్పించాల్సిన అవసరం ఉంది. విద్యా రంగంలో మాతృభాషలో బోధనకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా విద్యార్థుల్లో అవగాహన, సృజనాత్మకత మరింత పెరుగుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పరిపాలన, న్యాయ వ్యవస్థ, వ్యాపార రంగాల్లో తెలుగును విస్తృతంగా ఉపయోగించడం ద్వారా భాషకు సామాజిక బలం పెరుగుతుంది. సినిమా, మీడియా,సాహిత్యం ద్వారా తెలుగు ఇప్పటికే ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందింది. ఇప్పుడు ఆ గుర్తింపును స్థిరమైన అభివృద్ధిగా మార్చాల్సిన సమయం ఇది. ఈ మొత్తం ప్రక్రియలో యువత పాత్ర అత్యంత కీలకం. ఇంగ్లీష్ అవసరం ఉన్నా, మాతృభాషను నిర్లక్ష్యం చేయరాదు. తెలుగు మాట్లాడడం వెనుకబాటు కాదు, అది సంస్కారానికి, స్వాభిమానానికి ప్రతీక. టెక్నాలజీని ఉపయోగించి తెలుగును కొత్త తరానికి చేరువ చేయడమే అసలైన తెలుగు భాష అభివృద్ధి.

ప్రపంచమంతా విస్తరించి ఉన్న కోట్లాది తెలుగు హృదయాలను దోచుకొన్న తెలుగు భాష ఎన్నో శతాబ్దాలుగా వికసిస్తూ వస్తుంది. గొప్ప కవులు,పండితులు, రచయితలు, గాయకులు, నాటక రచయితలు తెలుగు సాహిత్య ధనాన్ని ఎంతో ఎత్తుకు చేర్చారు. నన్నయ, తిక్కన, యర్రాప్రగడలతో ప్రారంభమైన ఆంధ్ర మహాభారతం నుండి గురజాడ, విశ్వనాథ, శ్రీ శ్రీ వరకు, పొట్టి శ్రీరాములు నుంచి గిడుగు వెంకట రామమూర్తి వరకు ఇంకా నేటి ఆధునిక రచయితల వరకు తెలుగు భాష అభివృద్ధికి చేసిన సేవలు అమూల్యం అని చెప్పాలి. ప్రపంచవ్యాప్తంగా 18 కోట్ల మంది మాట్లాడే భాష తెలుగు. 6 వేలకు పైగా భాషల్లో అందమైన లిపి వున్న రెండో భాష తెలుగు. దేశ భాషలందు తెలుగు లెస్స అన్నారు శ్రీ కృష్ణ దేవరాయలు..తేనె లోలికే తెలుగు భాష కమ్మదనం చూసి మనం గర్వపడాలి. ప్రపంచంలో అతి మధుర భాషల జాబితాలో చోటు సంపాదించిన మహత్తరమైన మాతృభాష మనది. మరి అటువంటి భాషను మనం ఈ రోజు ఎంతగా కాపాడుతున్నాం అన్నది ప్రశ్న. తెలుగు భాష కోసం మనం చేస్తున్నది మరియు చేయాల్సింది నేటికీ లోటు స్పష్టంగా కనిపిస్తోంది. అతి ప్రాచీన భాష మన తెలుగు భాష నేడు నిరాదరణకు గురి అవుతుంది. ప్రపంచీకరణ యుగంలో ఇంగ్లిష్-హిందీ ప్రాముఖ్యత పెరుగుతున్న కొద్దీ మన తెలుగుకు మనమే దూరమవుతున్న ప్రమాదాన్ని గుర్తించాలి. కుటుంబాలలో పిల్లలతో తెలుగులో మాట్లాడక పోవడం,తెలుగు పుస్తకాలు చదవడం తగ్గి పోతుంది.

భాషాభివృద్ధి కోసం నేటికీ ఎన్నో కార్యక్రమాలు జరుగుతున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో తెలుగు అధికార భాషా సంఘాలు వున్నాయి. ఆగస్టు 29 తెలుగు భాషా దినోత్సవం. ప్రపంచ తెలుగు మహాసభలు-వివిధ దేశాల్లో-అమెరికా-ఆస్ట్రేలియా-యూరప్ -సింగపూర్-వంటి దేశాలలో తెలుగు సంఘాలు, తెలుగు డిజిటల్ నిఘంటువులు, డిజిటల్ లైబ్రరీలు, యూనికోడ్, ఏ ఐ, డిజిటల్ అనువాద సాధనాల ద్వారా తెలుగు అభివృద్ధికి కృషి జరుగుతూనే వున్నది. ప్రస్తుత సమాజంలో తెలుగు భాష ఆంగ్లీకరణ అవుతుంది. మార్కెట్ వలయంలో మాతృ భాష చిక్కుకున్నది. ఈ నేపథ్యంలో తెలుగు భాష అభివృద్ధికి కృషి జరగాలి. ప్రధానంగా పరిపాలనలో తెలుగు కనపడితే తెలుగు భాషాభివృద్ధికి అవరోధాలు తొలగి పోతాయి. 20-9-1955 న మొదటిసారి ఆంధ్రప్రదేశ్ శాసనసభ తెలుగును పాలనా భాషగా అప్పటి ప్రభుత్వం తీర్మానం చేసింది. ఆనాటి స్పీకర్ అయ్యదేవర కాళేశ్వర రావు అధ్యక్షతన కమిటీ కి పాలనా పరిభాష పదాలు రూపొందించే బాధ్యత అప్పగించారు. 1959లో తాలూకా స్థాయి వరకు తెలుగు అమలు సాధక బాధకాలను పరిశీలించేందుకు ఒక స్పెషల్ ఆఫీసర్ ను నియమించారు. 1966 లో అధికార భాషా సంఘాన్ని ఏర్పాటు చేశారు. వావిలాల గోపాల కృష్ణయ్య, డా ,సి నారాయణ రెడ్డి, ఎబికె, బుద్ధప్రసాద్ వంటి వారు అధికార భాషా సంఘం అధ్యక్షులుగా వున్న కాలంలో వ్యక్తిగత పలుకుబడితో భాషాభివృద్ధికి అనేక కార్యక్రమాలు నిర్వహించారు. తెలుగు భాషను ఆధునీకరించడం, తెలుగేతరులకు తెలుగు బోధించడం, విశ్వ విద్యాలయాల స్థాయి వరకు తెలుగు మాధ్యమంలో చదువు చెప్పడం అనే లక్ష్యాలతో 12-6-1968న తెలుగు అకాడమీ ఏర్పడింది. అది చివరికి పాఠ్య పుస్తకాల ప్రభుత్వ ప్రచురణ సంస్థగా మారిపోయింది.

తెలుగు భాష అభివృద్ధి కోసం వివిధ కాలాలలో ఎందరో మహనీయులు శ్రమించారు. తెలుగు భాషా పరిరక్షణకు కృషి చేసిన పాలకుల్లో ప్రముఖులు స్వాతంత్రానికి పూర్వం శ్రీ కృష్ణ దేవరాయలు కాగా, స్వాతంత్ర్యం అనంతరం నందమూరి తారక రామారావు భాషాభివృద్ధికి కృషి చేశారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రి కాక ముందు దేశ రాజధానిలో తెలుగు వారికి గుర్తింపు లభించేది కాదు. తెలుగువారు ఎవరైనా ఢిల్లీ వెళ్తే మదరాశియులుగానే తెలుగువారిని సంభోదించేవారు.తెలుగు కళల వికాసానికి 1985లో ఎన్టీఆర్ తెలుగు విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. కొన్నేళ్ల క్రితం వరకు తెలుగంటే ఆంధ్ర, తెలంగాణ కే పరిమితం అని భావించే వారున్నారు. కానీ నేడు పరిస్థితి మారింది. అమెరికా నుండి ఆస్ట్రేలియా వరకు, యూరప్ నుండి ఆఫ్రికా వరకు 120కి పైగా దేశాలలో తెలుగు సంఘాలు భాష అభివృద్ధికి పని చేస్తున్నాయి. అమెరికాలో తెలుగు భాషకు అధికారిక, సామాజిక అకడమిక్ గుర్తింపు. అమెరికాలోని పలు స్కూల్స్, యూనివర్సిటీలలో తెలుగు సెకండ్ లాంగ్వేజ్‌గా బోధన జరుగుతుంది.

విదేశాలలో తెలుగు సంఘాలు పిల్లలకు తెలుగు బోధిస్తూ భాషను పరిరక్షిస్తుంటే, స్వదేశంలో తెలుగు మాట వినిపించని ఇళ్ళ సంఖ్య పెరగడం ప్రమాదకరం. తెలుగు భాషను అధికారిక పాలనా వ్యవహారాల్లో తప్పనిసరి చేయాలి. భాషను రక్షించడం ప్రతి తెలుగు వారి బాధ్యత. ఇంట్లో ఇంగ్లీష్ మాట్లాడితే గొప్పగా, తెలుగులో మాట్లాడితే వెనుకబాటు అన్న భావజాలం ప్రమాద ఘటికలు మ్రోగిస్తుంది. తెలుగు భాషను కాపాడడానికి చేయాల్సినవి కుటుంబంలో తెలుగు మాట్లాడటం, తెలుగు పుస్తకాలు, పత్రికలు చదవడం, పాఠశాలల్లో మాతృభాష బలోపేతం చెయ్యడం, యువతలో కవిత్వం, రచన ప్రోత్సాహించాలి. తెలుగు భాషకు చరిత్ర ఉంది. అమ్మ భాషకు విలువ ఇచ్చినప్పుడే జన్మ భూమి విలువ తెలుస్తుంది. మాతృభాష నుండే ప్రాథమిక విద్య నేర్పితే పసిపిల్లలకు తేలిగ్గా అర్థం అవుతుందని విద్యావేత్తలు, భాషావేత్తల అభిప్రాయం. తెలుగు భాషను కట్టుదిట్టంగా అమలు చెయ్యడానికి వీలుగా తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థను ఏర్పాటు చేసి స్వతంత్ర ప్రతిపత్తి తో ప్రజలకు, శాసన సభలకు, ప్రభుత్వానికి జవాబు దారి చెయ్యాలి. ప్రతి ఇంట్లో తెలుగు మాట్లాడాలి. ప్రతి పాఠశాలలో తెలుగు బోధన బలోపేతం కావాలి. మన భాష గొప్పదని చెప్పుకోవడం కాదు ఆ గొప్పదనాన్ని తరతరాలకు అందించడం నిజమైన బాధ్యత. తెలుగు భాషాభివృద్ధికి ప్రభుత్వాలు కొంతవరకే చేయగలవు. భాషను కాపాడుకోవడం ప్రజల చేతుల్లోనే వుంది. కావునా ప్రతి ఒక్కరూ తమ మాతృభాష తెలుగును ప్రచారం చేయాలి. ఇతర భాషలతో పోటీపడి తెలుగు వినియోగం పెంచాలి.

తొండపు దశరథ జనార్దన్,
టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు

# రాజధాని గ్రామాల అభివృద్ధిపై దృష్టి

**- మంత్రి నారాయణ వెల్లడి**

అమరావతి (చైతన్యరథం): రాజధాని గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధిపై దృష్టి సారించామనా పురపాలక, పట్టణాభివద్ధి శాఖల మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. రాజధాని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై నిర్వహించనున్న గ్రామసభల్లో భాగంగా మొదటి రోజు శుక్రవారం నేలపాడు, మల్కాపురం గ్రామ సభల్లో మంత్రి నారాయణ, తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులపై గ్రామస్థుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ రాజధాని అభివృద్ధిలో భాగంగా గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారన్నారు. జగన్ హయాంలో అమరావతిని పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాజధాని సమస్యలపై దృష్టి పెట్టామన్నారు. ట్రంక్ రోడ్ల పనులు వేగంగా జరుగుతున్నాయి. గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, లే ఔట్ల పై దృష్టి పెట్టాం. అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పై అధికారులు కసరత్తు చేశారు. వర్షాలు వచ్చినప్పుడు ఇబ్బంది



లేకుండా అధికారులు డిజైన్ చేశారు. ఎమ్మెల్యే తో మాట్లాడి..గ్రామస్థుల తో కలిసి సమస్యలపై దృష్టి పెట్టాం. ఆరు నెలల్లో 29 రాజధాని గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుంది. ఈ నెల 7 నుంచి రెండో విడత ల్యాండ్ పూలింగ్ ఉంటుందని మంత్రి నారాయణ తెలిపారు.

**నెలాఖరుకు స్టీల్‌బ్రిడ్జి పూర్తి**

రాజధాని అమరావతిలోకి వచ్చేందుకు కరకట్టపైకి వెళ్లే అవసరం లేకుండా త్వరలోనే స్టీల్ బ్రిడ్జి అందుబాటు లోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. రాజధాని అమరావతిలో శుక్రవారం ఆయన పర్యటించారు. సీడ్ యాక్సెస్ రోడ్డు, గుంటూరు చానల్ పై నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా అందుబాటులోకి వచ్చిన 1.5 కిలో మీటర్ల సీడ్ యాక్సెస్ రోడ్డు వల్ల విజయవాడ నుంచి అమరావతికి కరకట్టపై ప్రయాణ దూరం తగ్గిందన్నారు. నెలాఖరు వరకు స్టీల్ బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని కాంట్రాక్ట్ సంస్థను ఆదేశించామని చెప్పారు. ఏదాదిలో ప్రధాన రోడ్డు నిర్మాణం పూర్తవుతుందని తెలిపారు. ప్రస్తుతం ట్రంక్ రోడ్డు నిర్మాణాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటు పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. కాగా అమరావతిలో మరో 1.5 కి.మీ సీడ్ యాక్సిస్ రోడ్డు అందుబాటులోకి వచ్చింది. దీంతో విజయవాడ–అమరావతి మధ్య కరకట్ట నుంచి ప్రయాణ దూరం తగ్గింది.

# రైతుల హక్కులు కాపాడేలా చర్యలు

**- మంత్రి గుమ్మిడి సంధ్యారాణి**

సాలూరు (చైతన్యరథం): భూముల మీద రైతుల హక్కులను కట్టుదిట్టం చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం, శివరాంపురం గ్రామంలో శుక్రవారం లబ్ధిదారులకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 76,752 పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పార్వతీపురం నియోజకవర్గం - 22,1977, సాలూరు నియోజకవర్గం – 14,056, కురుపాం నియోజకవర్గం – 16,399, పాలకొండ నియోజకవర్గం – 24,100 పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో పట్టాదారు పాస్ పుస్తకాలపై జగన్ ఫొటోలు పెట్టి ప్రచారం చేసుకున్నారని మంత్రి విమర్శించారు. ప్రజల హక్కుల పత్రాలపై రాజకీయ ముద్ర వేయడం తగదని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చే పట్టాదారు పాస్ పుస్తకాలపై కేవలం ప్రభుత్వ రాజ ముద్ర మాత్రమే ఉంటుందని మంత్రి తెలిపారు. పుస్తకంలో లబ్ధిదారుల భూమి వివరాలు సులభంగా తెలుసుకోడానికి క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశామని చెప్పారు



# విద్యుత్ వినియోగదారులకు ఊరట

- **ప్రజలపై భారం పడకుండా చర్యలు**
- **రూ.4,492 కోట్ల ట్రూ అప్ ఛార్జీలు భరించనున్న కూటమి ప్రభుత్వం**
- **హామీలన్నీ అమలు చేస్తూ సీఎం చంద్రబాబు సుపరిపాలన**
- **ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నుకసాని బాలాజీ**

అమరావతి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ప్రజలపై విద్యుత్ భారం పడకుండా చూస్తోందని ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నుకసాని బాలాజీ అన్నారు. శుక్రవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వం 18 నెలలుగా సుపరిపాలన అందిస్తోందన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాకుండా.. ఇవ్వని హామీలను కూడా అమలు చేస్తున్నారు. ఐదేళ్ల జగన్ రెడ్డి పాలనలో రాష్ట్ర ప్రజలు ఎన్నో కష్టాలు, బాధలు, దౌర్జన్యాలకు గురయ్యారు. జగన్ రెడ్డి పాలనలో రాజ్యాంగ పాలనకు బదులుగా అప్రజాస్వామికంగా, దౌర్జన్యంగా పాలన సాగించారు. దీంతో వైసీపీకి గట్టిగా బుద్ధి చెప్పిన ప్రజలు కూటమికి 164 సీట్ల భారీ మెజార్టీతో విజయం కట్టాబెట్టారు. ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఇచ్చిన హామీలను అమలు చేసుకుంటూ.. రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా సీఎం చంద్రబాబు పరుగులు పెట్టిస్తున్నారు. జగన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో రూ.10 లక్షల కోట్ల అప్పుల ఊబిగా రాష్ట్రాన్ని మార్చేశాడు. ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేనప్పటికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నారని నూకసాని బాలాజీ చెప్పారు.

**9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిన జగన్**

జగన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలోని విద్యుత్ వ్యవస్థ పూర్తిగా నాశనం చేసేశాడు. అనధికార విద్యుత్ కోతలతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురి చేశాడు. జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి దాదాపు రూ.32 వేల కోట్లు ప్రజలపై భారం వేశాడు. అదే జగన్ రెడ్డి నేడు.. కూటమి ప్రభుత్వం ప్రజలను పట్టించుకోవట్లేదు.. ప్రజలను అన్యాయం చేస్తోందంటూ.. వారి దొంగల ముఠాతో దుష్ప్రచారం చేయిస్తున్నాడు. జగన్ రెడ్డి ఎన్ని కుట్రలు పన్నినా కూడా ప్రజలు ఎవరూ కూడా పట్టించుకునే స్థితిలో లేరు. ట్రూ అప్ ఛార్జీల పేరుతో రూ.4,492 కోట్ల మొత్తాన్ని ప్రజల నుంచి వసూలు చేసుకుంటామని విద్యుత్ సంస్థలు కోరినా సీఎం చంద్రబాబు నాయుడు అమోదించలేదు. ప్రజలపై అధిక భారం పడకూడదనేదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన. అందులో భాగంగానే ట్రూఅప్ ఛార్జీలు రూ. 4,492 కోట్ల భారాన్ని ప్రజలపై పడకుండా చేసి, ప్రభుత్వమే చెల్లిస్తుందని నిర్ణయం తీసుకుని రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర కానుకగా అందజేశారని నూకసాని బాలాజీ తెలిపారు.

**విద్యుత్ రంగంలో పలు సంస్కరణలు**

జగన్ రెడ్డి పాలనలో అక్వా రైతులకు యూనిట్ రూ.3.50 వసూలు చేస్తే.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత యూనిట్ రూ.1.50లకు తగ్గిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. జగన్ రెడ్డి పాలనలో రూ.5.19లకు బయటనుంచి విద్యుత్ కొనుగోలు చేస్తే.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 4.70లకు కొనుగోలు చేస్తోంది. జగన్ ఐదేళ్ల పాలనలో ఛార్జీలు పెంచి.. కమీషన్ల కోసం అధిక రేట్లకు విద్యుత్ కొనుగోలు చేసి ప్రజలపై భారం మోపారు. రోజురోజుకు మారుతున్న ధరలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం తక్కువ ధరకే కొనుగోలు చేస్తోంది. గత ప్రభుత్వ పాలనలో వైసీపీ నేతలు జేబులు నింపుకునేందుకు, కమీషన్లు కోసం కక్కుర్తి పడి రాష్ట్ర ప్రజలను అనేక విధాలుగా ఇబ్బందులకు గురి చేశారే తప్ప.. ప్రజలను పట్టించుకున్న పాపానపోలేదు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లేకుండా చేశారు.. అక్రమ కేసులు పెట్టారు.. పెట్టుబడులను తరిమికొట్టారు. యువతకు ఉద్యోగాలు లేకుండా చేశారు. ఎక్కడ కూడా ప్రజాస్వామ్యబద్ధ పాలన అనేది కనిపించలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో ఒక పక్క రాజ్యాంగబద్ధ పరిపాలన అందిస్తునే.. మరోపక్క జగన్ రెడ్డి ముఠా చేసిన దోపిడీలకు చరమగీతం పాడుతూ.. మరోపక్క ప్రజల మీద పడ్డ ఆర్థిక భారాలను తగ్గిస్తున్నారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌ను మిగులు విద్యుత్ రాష్ట్రంగా మలిచేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అనేక విద్యుత్ సంస్కరణ కార్యక్రమాలు చేపడుతున్నారు. అదే విధంగా రాష్ట్రంలో సోలార్, పవన విద్యుత్‌కు అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచిత సోలార్ రూఫ్‌టాప్‌లు, బీసీలకు రూ.20 వేలు అధిక సబ్సిడీతో సోలార్ రూఫ్‌టాప్‌లు అందజేస్తున్నారు. బడుగు బలహీనవర్గాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారని నూకసాని బాలాజీ చెప్పారు.

**జగన్ అబద్ధాలను ప్రజలు నమ్మరు**

ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో కేవలం 15 శాతం హామీలను మాత్రమే అమలు చేసిన విషయాన్ని మరిచిపోయి.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే 90 శాతం హామీలను అమలు చేస్తే.. ప్రెస్‌మీట్‌లు పెట్టి కూటమి ప్రభుత్వం విఫలమైందని, రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని, రాష్ట్రంలో అరాచక, కక్ష్యసాధింపు చర్యలు తీసుకుంటున్నారని ప్రజలను మభ్యపెట్టే విధంగా పిచ్చి ప్రేలాపనలు పేలుతున్నారు. కానీ, ప్రజలెవరూ కూడా ఆయన అబద్ధాలను నమ్మే సిత్థిలో లేరని గ్రహించలేకపోతున్నాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలకు అమోదయోగ్యమైన పాలన అందిస్తూ.. సంక్షేమంతో



పాటుగా అభివృద్ధిని కూడా సమాపాళ్లలో ముందుకు తీసుకువెళ్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే అమలు చేసి చూపించారు. అలాగే రాష్ట్రానికి అనేక పెట్టుబడులు తీసుకువస్తున్నారు. దీంతో రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగాలకు ఉద్యోగాలు లభిస్తాయి. రాజధాని అమరావతి పనులు శరవేగంగా సాగుతున్నాయి. పోలవరం పనులుగా జోరుగా సాగుతున్నాయి. ఇన్ని చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న మద్దతును చూసి ఓర్వలేక కూటమి ప్రభుత్వంపై జగన్ రెడ్డి అతని ముఠా బులుగు మీడియాలో ఎన్ని రకాలుగా దుష్ప్రచారం చేయాలో చేస్తున్నారు. 2029 ఎన్నికల్లో మ్యాజిక్ ఫిగర్ దాటగానే రప్పా.. రప్పా అంటున్నారు.. కానీ, ఐదేళ్ల కాలంలో జగన్ రెడ్డి విధ్వంసక, అవినీతి, అరాచక పాలనను.. కూటమి ప్రభుత్వం అందిస్తున్న పాలనను చూసిన ప్రజలు ఎవరికి ఓటు వేయాలో ఈ సరికే నిర్ణయం తీసుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో మరో 15 ఏళ్ల పాటు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటం ఖాయమమైపోయిందని నూకసాని బాలాజీ ఉద్ఘాటించారు.

# ‘రాజముద్ర’తో రైతుల హక్కుల పరిరక్షణ

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఉద్ఘాటన
- రైతుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి పాలన
- అధికారంలోకి రాగానే చీకటి చట్టం ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేశాం
- పాస్ బుక్ లపై రాజముద్రతో రైతులకు ఎంతో మేలు
- జగన్ ప్రచార యావతో రైతులు, భూ యజమానులు ఇబ్బందుల పాలు
- రెవెన్యూ సమస్యలకు తక్షణ పరిష్కారాలే లక్ష్యం
- నాగినాయన చెరువులో నూతన పాస్ బుక్‌లు పంపిణీ చేసిన మంత్రి సవిత



సోమందేపల్లి (చైతన్యరథం): పట్టాదారు పాస్ బుక్‌లపై రాజముద్ర వేసి రైతుల హక్కులు పరిరక్షించామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే జగన్ తీసుకొచ్చిన చీకటి చట్టం ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేశామన్నారు. ప్రచార యావతో పాస్ బుక్ లపైనా, సర్వే రాళ్లపైనా జగన్ రెడ్డి తన బొమ్మను వేసుకుని రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారన్నారు. కుంభకోణాలంటేనే జగన్ అని తీవ్రంగా మండిపడ్డారు. శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి మండలం నాగినాయన చెరువు గ్రామంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టు భూమి పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి సవిత పాల్గొన్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జగన్ తీసుకొచ్చిన చీకటి చట్టం ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఎన్నికల్లో హామీల్లో భాగంగా పట్టాదారు పాస్ బుక్ లపై జగన్ ఫొటో తొలగించి, రైతుల హక్కుల పరిరక్షణలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రాజముద్రను ముద్రించి, నూతన పాస్ బుక్‌లు అందజేస్తున్నామన్నారు. గతంలో పాస్ బుక్ లపై జగన్ ఫొటో ఉండడంతో రైతులు, భూ యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఇపుడా ఇబ్బందులన్నీ తొలగిపోయాయన్నారు. జిల్లాలో 31,368 మంది రైతులకు నూతన పాస్ బుక్‌లు అందజేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు.

### జగన్ అంటేనే కుంభకోణాలు

జగన్ ఐదేళ్ల అసమర్థ, ప్రచార యావ పాలనలో ప్రజాధనం దుర్వినియోగమైందని మంత్రి సవిత మండిపడ్డారు. పట్టాదారు పాస్ బుక్‌లపైనా, సర్వే రాళ్లపైనా తన బొమ్మలు, ప్రభుత్వ కార్యాలయాలపైనా వైసీపీ రంగులు వేసుకుని ప్రజల సొమ్మును ఇష్టారాజ్యంగా దుర్వినియోగం చేసిన ఘనుడు జగన్ అని అన్నారు. జగన్, ఆయన పార్టీ నాయకులు యథేచ్ఛగా భూ ఆక్రమణలకు పాల్పడ్డారన్నారు. జగన్ అంటేనే కుంభకోణాలని విమర్శించారు. ఇష్టారాజ్యంగా రీ సర్వేలు చేయడం వల్ల రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలయ్యారన్నారు. కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి జగన్ ఓర్వలేకపోతున్నాడన్నారు. రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవడానికి జగన్ శతవిధాలా ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. చివరికి జగన్‌తో పాటు వైసీపీ నాయకులు బెదిరింపులకు కూడా దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అభివృద్ధే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని, జగన్ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని మంత్రి సవిత స్పష్టంచేశారు.

### రెవెన్యూ సమస్యలకు తక్షణ పరిష్కారాలు

అంతకుముందు నూతన పాస్ బుక్ ల పంపిణీ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, రెవెన్యూ సమస్యలకు తక్షణ పరిష్కారాలు చూపాలన్నదే తమ కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టంచేశారు. గత ప్రభుత్వ అసమర్థ పాలన, రీ సర్వే తప్పుల తడకగా సాగడం వల్ల భూ సమస్యలపై అర్జీలు ఎక్కువగా వస్తున్నాయన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ క్లినిక్‌ల పేరుతో భూ సమస్యలకు పరిష్కారాలు చూపుతున్నామన్నారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కావడం వల్ల జిల్లాకు ఎంతో మేలు కలుగుతోందన్నారు. జిల్లాలో భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో కలెక్టర్, జేసీలు విశేష కృషి చేస్తున్నారని కొనియాడుతూ, వారితో పాటు కింది స్థాయి సిబ్బంది కూడా చిత్తశుద్ధితో పనిచేయాలని మంత్రి సవిత చెప్పారు. ప్రజలకు మంచి చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, ఇందుకు అధికారులు కూడా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, రెవెన్యూ అధికారులు, సగర కార్పొరేషన్ చైర్మన్ వెంకట రమణ, ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు, భారీ సంఖ్యలో రైతులు, స్థానికులు పాల్గొన్నారు.

## నాడు జగన్‌ది పబ్లిసిటీ పిచ్చి..
## నేడు రాజముద్రతో పాస్ పుస్తకాలు

- రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం
- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి
- వెల్లటూరు, చౌట గోగులపల్లిలో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ



పొన్నలూరు/ పీసీపల్లి (చైతన్యరథం): రాష్ట్రంలో రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. శుక్రవారం ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గం పొన్నలూరు మండలం వెల్లటూరు గ్రామంలో రైతులకు కొత్త పాస్ పుస్తకాలను మంత్రి డా.స్వామి, జిల్లా కలెక్టర్ పి.రాజబాబు పంపిణీ చేశారు. అనంతరం మార్కాపురం జిల్లా కనిగిరి నియోజకవర్గం పీసీపల్లి మండలం చౌట గోగులపల్లిలో ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి తో కలిసి రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి డా. స్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో భూహక్కులకు సంబంధించి 21లక్షల మంది రైతులకు కొత్త పాస్ పుస్తకాలను ప్రభుత్వం పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుందన్నారు. రాష్ట్రంలో రీ సర్వే పూర్తి చేసిన గ్రామాల లో కొత్తగా రైతులకు రాజముద్ర కలిగిన పట్టాదార్ పాస్ పుస్త కాలను పంపిణీ చేస్తున్నామన్నారు. భూమి హక్కులకు సంబంధించిన పట్టాదార్ పాస్ పుస్తకం రైతులకు హక్కుగా ప్రభుత్వం కల్పించిందన్నారు. గత ప్రభుత్వంలో పాలకులు పాసు పుస్తకాలపై వారి ఫొటోలను ముద్రించి రైతులకు పంపిణీ చేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుల సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల మేరకు రాష్ట్రంలో రీ సర్వే చేపట్టి పారదర్శకంగా రైతులందరికీ పట్టాదార్ పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నామన్నారు. పట్టాదార్ పాస్ పుస్తకాల్లో ఉన్న క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసిన వెంటనే రైతులకు సంబంధించిన భూముల వివరాలు, హద్దులు వెంటనే తెలుసు కోవచ్చునని చెప్పారు. రాష్ట్రంలో రైతులు సంబంధించి 22ఏ నిషేధ జాబితాలో ఉన్న 5 రకాల భూములను తొలగించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని మంత్రి ఈ సందర్భంగా చెప్పారు. రాబోయే రోజుల్లో ఇనాం భూములు, అసైన్మెంట్ భూములు నిషేధిత జాబితా నుండి తొలగించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కొండపి నియోజకవర్గంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తొలగించడానికి ప్రతి మండలంలో రెవెన్యూ క్లినిక్ లను నిర్వహించాలని కలెక్టర్ కు సూచించామన్నారు. రాష్ట్రంలో మహిళల కోసం శ్రీశక్తి పథకం క్రింద ఉచిత బస్సు సౌకర్యం అందుబాటులో తీసుకొచ్చామన్నారు. అలాగే తల్లికి వందనం కార్యక్రమం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ నగదు జమ చేస్తున్నామని ఆచెప్పారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లను ప్రతి ఇంటికి పంపిణీ చేస్తున్నామని మంత్రి చెప్పారు. గృహ నిర్మాణాలను పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు బిల్లులు వెంటనే చెల్లిస్తామని మంత్రి చెప్పారు. కొత్తగా మంజూరైన గృహాలను ఫిబ్రవరి మాసం నుండి ప్రారంభించడానికి లబ్ధిదారులు చర్యలు తీసుకోవాలన్నారు.

## స్వచ్ఛాంధ్రపై ప్రజల్లో అవగాహన పెంచాలి

- సరైన శిక్షణతో వివిధ వర్గాలకు అవగాహన కల్పించాలి
- పెడుతున్న ఖర్చుకు తగ్గ ఫలితాలు కనిపించాలి
- స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆదేశాలు
- అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్న ఏజెన్సీల పనితీరుపై అసంతృప్తి



అమరావతి (చైతన్యరథం): స్వచ్ఛాంధ్ర లక్ష్యాలను అన్ని వర్గాల ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్.. శిక్షణా కార్యక్రమాలు నిర్వహించే ఏజెన్సీలను ఆదేశించారు. స్వచ్ఛాంధ్ర విజన్-2047లో భాగంగా రాష్ట్రంలో పారిశుద్ధ్యానికి సంబంధించి అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించేందుకు మునిసిపల్, పంచాయతీ సిబ్బందికి, వివిధ సంస్థల వారికి, విద్యార్థులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించే ఏజెన్సీల పనితీరుపై చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అమరావతిలోని తన కార్యాలయంలో కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ శుక్రవారం ఏఐఐఎల్ఎస్‌జీ (ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్), వాష్ ఇన్‌స్టిట్యూట్ ఏజన్సీల వారితో వేరువేరుగా సమావేశమై ఇప్పటి వరకు జరిగిన కార్యక్రమాలను సమీక్షించారు. తాము 13 జిల్లాలలోని 70 మునిసిపాలిటీల్లో మూడు ఫేజులుగా సీబీ, ఐఈసీ (కెపాసిటీ బిల్డింగ్, ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్) కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏఐఐఎల్ఎస్‌జీ ఏజన్సీ రీజినల్ డైరెక్టర్ వి.చలపతి రాజ్ చెప్పారు. మన్యం, విజయనగరం, కృష్ణా, శ్రీకాకుళం, చిత్తూరు, బాపట్ల, నెల్లూరు, పల్నాడు, ఎన్టీఆర్, అన్నమయ్య, ప్రకాశం, తిరుపతి, కడప జిల్లాలలో తాము అవగాహన కల్పించేవారిని 12 కేటగిరీలుగా విభజించినట్లు వివరించారు. ఇప్పటి వరకు 42 మునిసిపాలిటీలలో 86 ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ ద్వారా 4,562 మందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. మునిసిపాలిటీలు, పాఠశాలల్లో పారిశుద్ధ్యం, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించడం... వంటి విషయాలలో శిక్షణ ఇచ్చి, వారికి అవగాహన కల్పించినట్లు వివరించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి, వారికి బహుమతులు కూడా ఇస్తున్నట్లు తెలిపారు.

స్వచ్ఛాంధ్ర విజన్-2047లో భాగంగా తాము 13 జిల్లాలలోని 9 కార్పోరేషన్లు, 38 మునిసిపాలిటీలు, 10 నగర పంచాయతీలలో ట్రైనింగ్, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వాష్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ శశాంక్ వివరించారు. శిక్షణ పొందేవారిని వార్డు స్థాయి నుంచి కార్పోరేషన్ స్థాయి వరకు 10 కేటగిరీలుగా విభజించి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఆయా రంగాలలో ప్రావీణ్యత కలిగిన వారితో శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు.

### చైర్మన్ పట్టాభిరామ్ సూచనలు

నాలుగు నెలల్లో జరిగిన శిక్షణా కార్యక్రమాల తీరుపై కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ఫొటోల వంటి కార్యక్రమాల ద్వారా మనల్ని మనం మోసం చేసుకోవద్దని హితవు పలికారు. ఫలితాలపై దృష్టి సారించాలన్నారు. కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నందున, అందుకు తగిన ఫలితాలు కనిపించాలని చెప్పారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను సమర్థవంతంగా అన్ని వర్గాల ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు చేపట్టవలసిన కార్యక్రమాల గురించి దిశానిర్దేశం చేశారు. శిక్షణ పొందినవారు ఎంతవరకు అవగాహన చేసుకున్నారో కూడా తెలుసుకోవాలని, వారి అవగాహనా సామర్థ్యాన్ని తెలుసుకోవడానికి, శిక్షణ తర్వాత వారికి పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. పరీక్షలో అధిక మార్కులు వచ్చిన వారికి బహుమతులు కూడా ఇవ్వాలన్నారు. స్వచ్ఛాంధ్ర లక్ష్యాలు, పారిశుద్ధ్యంపై మనం ప్రచారం చేసే అంశాలు ప్రజల్లోకి వెళ్లాలంటే ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కళాకారుల ద్వారా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. అలాగే, సోషల్ మీడియా ద్వారా ప్రజలను ప్రభావితం చేసేవారితో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి వారిని కూడా ఉపయోగించుకోవాలన్నారు. హోటల్స్, ట్రేడర్స్... వంటి ఇతర వ్యాపార సంస్థల అసోసియేషన్ల వారిని సమావేశపరిచి, వారి ద్వారా కూడా మన లక్ష్యాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయాలు, ఇతర విద్యా సంస్థలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, పదవీ విరమణ చేసినవారు, వివిధ సేవాదళాల ద్వారా కూడా పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలని చెప్పారు. అలాగే, వ్యర్థ పదార్థాల ద్వారా డబ్బు సంపాదించే మార్గాలను మహిళలకు తెలిసే విధంగా వివరించాలన్నారు. ఏజన్సీలు భవిష్యత్ ప్రణాళికలు, పూర్తి డేటాతో పక్కాగా రూపొందించుకోవాలని చెప్పారు. ఈ సమీక్షా సమావేశాల్లో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సీఓఓ దశరథరామి రెడ్డి, ఏఐఐఎల్ఎస్‌జీ ఏజన్సీ ప్రాజెక్ట్ మేనేజర్ సీహెచ్ రాజేష్, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎల్. వెంకటేశ్వరరావు, నోడల్ ఆఫీసర్ ఏ.శివన్నారాయణ, వాష్ ఇన్‌స్టిట్యూట్ అధికారులు పాల్గొన్నారు.

## పోర్టు, పరిశ్రమలు, పర్యాటకాన్ని

# అనుసంధానిస్తూ రోడ్ల విస్తరణ

- అమరావతిని కలుపుతూ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు
- మచిలీపట్నం హైవే ఆరు వరుసలుగా విస్తరణ
- అండర్ పాస్‌లు, డ్రైనేజీ సమస్యలు తీరుస్తాం
- ఉమ్మడి కృష్ణా జిల్లాలోని నేషనల్ హైవేల సమస్యలకు త్వరలో పరిష్కారం
- మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి
- ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రజాప్రతినిధుల సమావేశం



మచిలీపట్నం (చైతన్యరథం): ఉమ్మడి కృష్ణా జిల్లాలో జాతీయ రహదారుల విస్తరణ కార్యక్రమాన్ని పోర్టు, పరిశ్రమలు, పర్యాటకానికి అనుసంధానించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సయిజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఈ మేరకు జాతీయ రహదారులు, మోర్త్ (మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ హైవేస్) ప్రతినిధులతో మచిలీపట్నంలో ఎంపీ వల్లభనేని బాలశౌరి కార్యాలయంలో శుక్రవారం ఉమ్మడి కృష్ణా జిల్లా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ సుమారు రూ.35 వేల కోట్ల వ్యయంతో జిల్లాలో జాతీయ రహదారుల విస్తరణకు ప్రతిపాదనలున్నాయని, మచిలీపట్నం-విజయవాడ రోడ్డును రూ.1900 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. హైదరాబాద్-మచిలీపట్నం రోడ్డు విజయవాడ మీదుగా వస్తున్న సమయంలో ఎదురవుతున్న సమస్యలపై చర్చించాం. నేషనల్ హైవే 65ను ఆరు వరుసలుగా విస్తరించే పనులు త్వరలో ప్రారంభం కాబోతున్నాయి. ఆ మార్గంలో నిర్మించాల్సిన అండర్ పాస్‌లు, డ్రైనేజీలపై స్థానిక ప్రజాప్రతినిధుల నుండి ప్రతిపాదనలు స్వీకరించాం. పామర్రు-గుడివాడ ఎన్‌హెచ్ 65ను ఎన్‌హెచ్ 216కు అనుసంధానించడం గురించి చర్చించాం. అదే సమయంలో 189కి.మీల మేర ప్రతిపాదించిన అమరావతి ఔటర్ రింగు రోడ్డు.. కృష్ణా జిల్లాలో వుయ్యూరు, వల్లూరు మీదుగా గుడివాడ వరకు వెళ్తోంది. ఆ ప్రాంతంలో కూడా స్థానిక ప్రజాప్రతినిధుల నుండి ప్రతిపాదనలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

### ఎన్‌హెచ్ 216 విస్తరణకు డీపీఆర్

నేషనల్ హైవే 216ను నాలుగు వరుసలుగా అభివృద్ధి చేసేందుకు కూడా డీపీఆర్ సిద్ధమైంది. అదే సమయంలో సముద్రతీరం వెంబడి రోడ్డు అనుసంధానించాలని ప్రతిపాదించారు. బందరు పోర్టు నిర్మాణ పనులు కొలిక్కి వస్తున్నాయి. పోర్టుకు, పోర్టు అనుసంధానంగా వచ్చే పరిశ్రమలకు రవాణా సదుపాయాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. మంగినపూడి బీచ్ నుండి క ృత్తివెన్ను బీచ్ వరకు పర్యాటకాన్ని అభివ ృద్ధి చేస్తున్న నేపథ్యంలో ఈ రోడ్డు ప్రాముఖ్యతను మంత్రి వివరించారు. బీచ్‌లను రోడ్డుకు అనుసంధానించేందుకు లోసరి బ్రిడ్జి నుండి కోడూరు ఉల్లిపాలెం బ్రిడ్జి వరకు ఉన్న 70కి.మీలను కూడా పూర్తి చేయాలని, తద్వారా తీర ప్రాంత ప్రజలకు రవాణా సదుపాయాలు సులభతరం చేసే అవకాశం ఉంటుంది. ఆ రోడ్డు నిర్మాణం పూర్తైతే.. తుపాన్ల సమయంలో రక్షణగా కూడా నిలిచే అవకాశం ఉంటుందని మంత్రి రవీంద్ర అన్నారు. నేషనల్ హైవే 216 విస్తరణకు అవసరమైన భూసేకరణకు రైతుల అభిప్రాయాలు కూడా సేకరిస్తున్నాం. మచిలీపట్నం మూడు స్తంభాల సెంటర్ వరకు ఆ రోడ్డును విస్తరించాలి. అవసరమైన చోట ఫ్లై ఓవర్లకు ప్రతిపాదించారు. చిలకలపూడి, బందరుకోట, కరఅగ్రహారం మెడికల్ కాలేజీ, పోతేపల్లి వద్ద రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిలు కూడా మంజూరైనట్లు తెలిపారు. మచిలీపట్నం పోర్టును అమరావతికి అనుసంధానించేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

### త్వరలో సీఎంను కలుస్తాం

ఉమ్మడి కృష్ణా జిల్లాను అభివృద్ధికి కేరాఫ్‌గా నిలిపేందుకు ప్రతి ఒక్కరం కలిసి కట్టుగా అడుగేస్తున్నాం. అవసరమైన అభివృద్ధి ప్రతిపాదనలతో త్వరలోనే ముఖ్యమంత్రిని కూడా కలుస్తాం. ప్రస్తుతం మంజూరైన రోడ్డు విస్తరణ పనుల టెండర్ ప్రక్రియను మార్చి నాటికి పూర్తి చేస్తాం. జిల్లాలో పారిశ్రామిక, పర్యాటక అవసరాలకు అనుగుణంగా రోడ్డు మార్గాన్ని తీర్చిదిద్దుకుంటాం. మంగినపూడి నుండి కృత్తివెన్ను వరకు ఉన్న బ్యాక్ వాటర్‌ను కూడా అభివృద్ధి చేసి పర్యాటకం, ఆక్వా రంగాలను అభివ ృద్ధి చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

కార్యక్రమంలో ఎంపీలు వల్లభనేని బాలశౌరి, కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, గద్దె రామ్మోహన్‌రావు, బోడే ప్రసాద్, వెనిగండ్ల రాము, వర్ల కుమార్ రాజా, కాగిత కృష్ణ ప్రసాద్, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ, నేషనల్ హైవేస్ పీడీ, మోర్త్ ప్రతినిధులు హరికృష్ణ, విద్యాసాగర్ పాల్గొన్నారు.

# నేడు కొండగట్టుకు ఉపముఖ్యమంత్రి పవన్

**- ఆంజనేయ క్షేత్రంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**



అమరావతి (చైతన్యరథం): తెలంగాణలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన కొండగట్టును రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శనివారం దర్శించుకొని తిరుమల తిరుపతి దేవస్థానం సమకూర్చే నిధులతో నిర్మించనున్న భవనాలకు శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 10.30 11. 30 గంటల మధ్య ఈ కార్యక్రమాలు ఉంటాయి. కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి వారిని పవన్ కళ్యాణ్ ఇలవేల్పుగా భక్తితో కొలుస్తారు. ఎన్నికల్లో విజయం సాధించిన తరువాత కొండగట్టు స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయ అధికారులు, అర్చకులతో మాట్లాడినప్పుడు కొండగట్టు క్షేత్రానికి సుదూర ప్రాంతం నుంచి వచ్చే భక్తులు పడుతున్న ఇబ్బందులు ఆయన దృష్టికి వచ్చాయి. దీక్ష విరమణ మండపం, విశ్రాంతి గదులతో కూడిన సత్రం అవసరమని అధికారులు, అర్చకులు కోరారు. ఆలయ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో టీటీడీ సహకారంతో కొండగట్టు క్షేత్రంలో వీటి నిర్మాణానికి పవన్ కళ్యాణ్ ప్రతిపాదనలు చేశారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. పవన్ కళ్యాణ్ ఈ విషయమై టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుతోనూ చర్చించారు. టీటీడీ బోర్డు రూ.35.19 కోట్లు మంజూరుకు అంగీకారం తెలిపింది. ఈ నిధులతో దీక్ష విరమణ మండపం, 96 గదుల సత్రం నిర్మాణాలు చేపడతారు. ఒకేసారి 2 వేల మంది భక్తులు దీక్షలు విరమించేలా మండపం నిర్మించనున్నారు. శనివారం నిర్వహించే కార్యక్రమంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఏపీ శాసన మండలి విప్ పిడుగు హరిప్రసాద్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, టీటీడీ బోర్డు మెంబర్లు బి.ఆనందసాయి, బి.మహేందర్ రెడ్డి గారు, టీటీడీ ఎల్ఏసీ ఛైర్మన్ ఎన్ శంకర్ గౌడ్, ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్, తదితరులు పాల్గొననున్నారు.

### జనసేన కార్యకర్తలతో సమావేశం

ఆలయంలో అభివృద్ధి పనుల శంకుస్థాపన అనంతరం జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర నాయకులు, శ్రేణులతో పవన్ సమావేశం కానున్నారు. ఆ తర్వాత ఇటీవలి తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో జనసేన మద్దతుతో గెలిచిన వారితోనూ సమావేశం అవుతారు. కొడిమ్యాల సమీపంలోని బృందావనం రిసార్టులో ఈ సమావేశాలు ఏర్పాటు చేశారు.

# టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజా వేదిక షెడ్యూల్




అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ప్రతి రోజు నిర్వహిస్తున్న ప్రజా వేదిక కార్యక్రమం జనవరి నెల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తున్న విషయం తెలిసిందే. ప్రతి శుక్రవారం ఆయా నియోజకవర్గాల్లో సంబంధిత శాసనసభ్యుల ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహిస్తున్నందున ఎన్టీఆర్ భవన్‌లో ప్రతి శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహించటం లేదు. 14, 15, 16 తేదీల్లో భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు, 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆ రోజుల్లో కూడా గ్రీవెన్స్ నిర్వహించరు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని పార్టీ కేంద్ర కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

**నేటి నుండి ప్రజావేదికలో పాల్గొనే నాయకుల వివరాలు**

03/01/2026 –మంత్రి డోలా బాల వీరాంజినేయ స్వామి, ఏపీ గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు

05/01/2026 – మంత్రి నిమ్మల రామానాయుడు, ఏపీఎస్ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ళ నారాయణ

06/01/2026 – మంత్రి కొలుసు పార్థసారథి, ఏపీ హౌసింగ్ బోర్డ్ ఛైర్మన్ బత్తుల తాతయ్య బాబు

07/01/2026 – మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్సీ, కేంద్ర కార్యాలయ కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు

08/01/2026 – మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, మండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ, డీసీసీబీ ఛైర్మన్ నెట్టం రఘురాం

10/01/2026 – మంత్రి వాసంశెట్టి సుభాష్, ఏపీఎల్‌డబ్ల్యూబీ ఛైర్మన్ వెంకట శివుడు యాదవ్

12/01/2026 – మంత్రి టీజీ భరత్, ఏపీటీఎస్ఎల్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ

13/01/2026 – మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ, కేంద్ర కార్యాలయ కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు

17/01/2026 – మంత్రి కొల్లు రవీంద్ర, ఙ్రూలావీఔాదీ ఛైర్మన్ పెల్లకూరు శ్రీనివాసులు రెడ్డి

19/01/2026 – మంత్రి ఎన్ఎండి ఫరూక్, ఏపీ గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి గురుమూర్తి

20/01/2026 – మం౹ఎస్ సవిత, ఏపీ హజ్ కమిటీ ఛైర్మన్ షేక్ హసన్ బాషా

21/01/2026 – మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర

22/01/2026 – మంత్రి పయ్యావుల కేశవ్, మాజీ ఎమ్మెల్సీ, కేంద్ర కార్యాలయ కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు

24/01/2026 – మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్

27/01/2026 – మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి

28/01/2026 – మంత్రి పొంగూరు నారాయణ, మాజీ ఎమ్మెల్సీ, కేంద్ర కార్యాలయ కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు

28/01/2026 – మంత్రి గుమ్మడి సంధ్యారాణి, కాకినాడ పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్

# వైసీపీ హయాంలో భ్రష్టుపట్టిన రెవెన్యూ వ్యవస్థ

**●వైసీపీ నాయకుల ప్రచారం... పిచ్చి పరాకాష్టకు చేరింది**

**●ఏడాదిలో రెవెన్యూ సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యం**

**●ఇక నుంచి పట్టాదారు పాస్‌పుస్తకాలను నేరుగా రైతుల ఇళ్లకే పంపిణీ**

**●కోటబొమ్మాళి మండలం అక్కయ్యవసలులో రైతులకు పాస్‌పుస్తకాలు పంపిణీ చేసిన మంత్రి అచ్చెన్నాయుడు**



కోటబొమ్మాళి (చైతన్యరథం): రాష్ట్రాన్ని ఏడాదిలోనే రెవెన్యూ సమస్యలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం అక్కయ్యవసలులో, రాష్ట్ర ప్రభుత్వం రాజముద్రతో ముద్రించిన కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలను రైతులకు మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వైసీపీ హయాంలో రీ-సర్వే పేరుతో రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా భ్రష్టుపట్టించారని, అప్పటి ప్రభుత్వం జగన్ బొమ్మతో ముద్రించిన పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేసి వ్యవస్థను రాజకీయ ప్రచారానికి ఉపయోగించిందని తీవ్రస్థాయిలో విమర్శించారు. రీ-సర్వే ప్రక్రియలో హద్దురాళ్ల ఏర్పాటు పేరుతో వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని, హద్దురాళ్లపై కూడా ఫోటోలు ముద్రించి వైసీపీ నాయకుల ప్రచారం... పిచ్చి పరాకాష్టకు చేరిందని, ప్రభుత్వ పథకాలపై పేర్లు ముద్రించుకొని ప్రజాధనాన్ని స్వప్రయోజనాలకు వినియోగించారని మండిపడ్డారు. రిసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు 2.5 లక్షల కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని, జనవరి 2 నుంచి 9 వరకు గ్రామసభల ద్వారా పంపిణీ జరుగుతుందని తెలిపారు. కొత్త పాస్‌పుస్తకాలు ప్రభుత్వ రాజముద్రతో పాటు క్యూఆర్ కోడ్‌తో, దేశంలో ఎక్కడా లేని విధంగా ఆధునిక సాంకేతికతతో ముద్రించామని చెప్పారు. రైతులు క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే భూమికి సంబంధించిన పూర్తి వివరాలు కనిపిస్తాయని, ఏవైనా తప్పులు ఉంటే వెంటనే అధికారులకు తెలియజేస్తే ఉచితంగా సరిదిద్దుతూ కొత్త పాస్‌పుస్తకాలు జారీ చేస్తామని తెలిపారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మరో కీలక నిర్ణయం తీసుకొని, భూసర్వే పూర్తైన తర్వాత పాస్‌పుస్తకాలను నేరుగా రైతుల ఇళ్లకు పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారని మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వంలో కార్యాలయాల్లో కూర్చుని భూ రికార్డులను తారుమారు చేయడంతో రైతులు, భూస్వాములు కార్యాలయాల చుట్టూ తిరిగి తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. ఈ సమస్యలను అధిగమించేందుకు ప్రస్తుతం మండల రెవెన్యూ అధికారి, ఆర్డీవో, జాయింట్ కలెక్టర్ స్థాయిలోనే భూ వివాదాలు పరిష్కరించే అధికారాలు కల్పించామని తెలిపారు. గత ప్రభుత్వ తప్పిదాల కారణంగా ప్రజలు ఐదేళ్ల పాటు ఇబ్బందులు పడ్డారని, వాటిని సరిచేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొని రెవెన్యూ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కట్టుబడి ఉందన్నారు. జిల్లా కేంద్రంలో మీ భూమి మీ చేతికి కార్యక్రమంలో ద్వారా 4 వేలమంది రైతులకు, భూ యజమానులకు ప్రయోజనం చేకూరిందని చెప్పారు. అలాగే, విద్యా మరియు ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలో ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఉండేందుకు వాట్సాప్ గవర్నెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకు వచ్చారని అన్నారు. ప్రజలు ఇంటి నుంచే పౌర సేవలు పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని అన్నారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, రెవిన్యూ అధికారులు, తెలుగు దేశం పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సాఫ్ట్‌బాల్ పోటీలకు వెళ్లే క్రీడాకారులకు స్పీకర్ అయ్యన్న అభినందనలు




రోలుగుంట (చైతన్యరథం): హరియాణా రాష్ట్రంలో ఈ నెల 6వ తేదీ నుంచి జరగనున్న జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన ఏపీ జట్టును శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అభినందించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఎంపికైన 36 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని, వారంతా అదుతేంగా రాణించి, పతకాలు సాధించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందరరేగా క్రీడాకారుల ఖర్చుల నిమిత్తం కృష్ణదేవిపేట హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం రూ.35వేలు, అనకాపల్లికి చెందిన ప్రముఖ విద్యాసంస్థల అధినేత దాడి రత్నాకర్ రూ.50వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ మొత్తాన్ని స్పీకర్ అయ్యన్న తన చేతుల మీదుగా క్రీడాకారులకు అందజేశారు. పోటీల్లో గెలిచి వస్తే క్రీడాకారులను ఘనంగా సన్మానిస్తామని స్పీకర్ ఈ సందర్భంగా వారికి భరోసా ఇచ్చారు.

# రాజముద్ర కలిగిన పాస్‌బుక్‌లతో రైతులకు గౌరవం

**●నూతన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ పాడేరు ఇన్‌ఛార్జ్ గిడ్డి ఈశ్వరి**



పాడేరు (చైతన్యరథం): రైతు ఫోటోతో రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌బుక్‌లు అందించి వారి గౌరవాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పెంచారని తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మాజీ శాసనసభ్యులు గిడ్డి ఈశ్వరి పేర్కొన్నారు. వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఫోటోతో ఉన్న భూమి పాసుపుస్తకాలు రద్దుచేసి కూటమి ప్రభుత్వం కొత్తగా రైతు ఫోటోలతో రాజముద్రతో కూడిన పాసుపుస్తకాల పంపిణీ శుక్రవారం నుంచి ప్రారంభించింది. కోటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూముల రీసర్వే అనంతరం రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పాడేరు మండలం ఇరడాపల్లి పంచాయతీ లడ్డపుట్టు గ్రామంలో రైతులకు నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను గిడ్డి ఈశ్వరి చేతుల మీదగా పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఈశ్వరి మాట్లాడుతూ... తమ భూమికి తమ ఫోటోతోనే పాస్ పుస్తకాలు ఇవ్వడంతో వారికి మరింత గౌరవం పెరిగినట్టు అయిందని చెప్పారు. రైతుల్లో ఇప్పటివరకు ఆ భూమి తనదైన జగన్మోహన్ రెడ్డి ఫోటో ఉండేసరికి తనది కాదనే భావన ఆత్మ న్యూనాతకు గురయ్యేవారని చెప్పారు. తన భూమి పాసుపుస్తకంపై తన ఫోటో లేకుండా జగన్ ఫోటో ఏంటంటూ అంతా తల పట్టుకున్నారని అందుకే చంద్రబాబునాయుడు రాజముద్రతో రైతుల ఫోటోతో కొత్తగా పాస్ పుస్తకాలు ఇస్తున్నారన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో రైతులు భూములు కొట్టేయాలని నాడు జగన్మోహన్ రెడ్డి వ్యూహం పన్నారన్నారు. అందుకే అందరి పాసుపుస్తకాలపైన ఆయన ఫోటోలు ముద్రించారన్నారు.

# అందరికి రాజముద్రతో పాస్ పుస్తకాలు అందిస్తాం : ఎమ్మెల్యే గంటా




భీమిలి (చైతన్యరథం): రైతులకు త్వరితగతిన పట్టాదార్ పాస్ పుస్తకాలను అందజేస్తామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. భీమిలి మండలం పెద్ద నాగమయ్యపాలెంలో రైతులకు శు క్రవారం ఆయన పట్టాదార్ పాస్ పుస్తకాలను అందజేశారు. ఈ సందరరేగా మాట్లాడుతూ.. 9వ తేదీ వరకు జరిగే కార్యక్రమంలో భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో 13 వేలకు పైగా పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తామన్నారు. పాత భూ హక్కు పత్రాల స్థానంలో ఎలాంటి తప్పులు లేని కొత్త పాస్ పుస్తకాలను రాజముద్రతో ఇస్తున్నామని పేర్కొన్నారు. రీ సర్వే త్వరగా పూర్తి చేసి వచ్చే ఏడాది డిసెంబరు లోపు అందరికీ పట్టాదార్ పాస్ పుస్తకాలు అందజేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని వెల్లడించారు.

**అమ్మవార్ల ఆలయాన్ని ప్రారంభించిన గంటా**

భీమిలి మండలం పెద్ద నాగమయ్య పాలెంలో పోలమాంబ, భూలోకమ్మ, రమణమ్మ, దుర్గాలమ్మ అమ్మవార్ల ఆలయాన్ని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. రూ. 63.15 లక్షల దివీస్ సీఎస్ఆర్ నిధులతో ఆలయాన్ని నిర్మించారు. ఈ సందరరేగా మాట్లాడుతూ.. రేషన్ డిపో, సచివాలయం, అటవీ శాఖలో ఉన్న సమస్యల పరిష్కారానికి క ృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ సాయంతో పాటు దివీస్ సాయం కూడా తీసుకుని గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకటప్పడు, కూటమినాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే తోయక



కురుపాం (చైతన్యరథం): పార్వతీపురం మన్యం జిల్లా, కురుపాం మండలం పెల్లివలస గ్రామంలో శుక్రవారం నాడు రైతులకు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను కురుపాం ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గతంలో జగన్ ఫోటోతో జారీ చేసిన పట్టాదారు పాస్ పుస్తకాలలో ఉన్న పలు తప్పిదాలను ప్రభుత్వం సరిదిద్దిందని తెలిపారు. తాజా పాస్ పుస్తకాలను కేవలం ప్రభుత్వ రాజముద్రతో పాటు క్యూఆర్ కోడ్‌తో అత్యంత పారదర్శకంగా రూపొందించామని చెప్పారు. రైతుల భూ హక్కులకు పూర్తి భద్రత కల్పించడంతో పాటు, భూ వివరాల్లో స్పష్టత తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు.

# వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు వ్యాఖ్యలు దారుణం

**●రంపచోడవరం ఎమ్మెల్యే శిరీష దేవిపై బెదిరింపులు అత్యంత హేయం**

**●రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు కొండారెడ్డి నరహరి వరప్రసాద్**



రంపచోడవరం (చైతన్యరథం): వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు రంపచోడవరం నియోజకవర్గం మహిళా ఎమ్మెల్యే శిరీష దేవిని ఉద్దేశించి చేసిన బెదిరింపు వ్యాఖ్యలు అత్యంత దుర్మార్గమైనవి, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమైనవని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు కొండారెడ్డి నరహరి వరప్రసాద్ తీవ్రంగా ఖండించారు. గిరిజన మహిళా ప్రజాప్రతినిధిని బెదిరించే స్థాయికి వైసీపీ నాయకులు దిగజారడం ఇదేమి కొత్త కాదు అని వ్యాఖ్యానించారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గిరిజనులపై కొనసాగిన అణచివేతకు నిదర్శనం. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గిరిజనులపై అక్రమ కేసులు, దాడులు, భయభ్రాంతులకు గురిచేయడం సాధారణంగా మారిందని గుర్తు చేశారు. తమ హక్కుల కోసం ప్రశ్నించిన మహిళని గత వైసీపీ ప్రభుత్వంలో ట్రాక్టర్‌తో తొక్కించి చంపేశారు. ఒక గిరిజనుడుని కాళ్లు చేతులు కట్టేసి అతనిపై మూత్రం పోసి వైసీపీ నాయకులు రాక్షసానందం పొందారు ఇలాంటి ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా గిరిజనుల మనసులలో తీవ్ర కలవరపాటుకు గురి చేసింది. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనులకు రక్షణ లేకుండా పోయింది. నేడు ఒక మహిళను ఉద్దేశించి వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు మీడియా వేదికగా చేసిన బెదిరింపు వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గిరిజనులను మరోమారు కలవర పెట్టింది ప్రతిపక్షంగా కూడా లేని వైసీపీ పార్టీలో నాయకులు ఇలాంటి బెదిరింపులు దిగుతుంటే గత వైసీపీ ప్రభుత్వంలో ఎంత అణచివేతకు గురి అయ్యామో అని ఆవేదనతో రాష్ట్ర గిరిజన సమాజం ఉందని నరహర ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు.

## రెవెన్యూ సమస్యల నుండి విముక్తి కల్పించండి

**●నియోజకవర్గాన్ని ముందజలో ఉంచాలి : ఎమ్మెల్యే వేగుళ్ళ**



మండపేట (చైతన్యరథం): నియోజకవర్గంలో ఉన్న రెవెన్యూ సమస్యల నుండి విముక్తి కల్పించాలని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. మండపేట మండలం మారేడుబాక లో ప్రభుత్వం కొత్తగా జారీ చేసిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ చేకూరి కీర్తి విచ్చేశారు. మరో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు మాట్లాడుతూ... విలీనం అయిన అనంతరం మొట్టమొదట మండపేటకు విచ్చేసిన కలెక్టర్ కు పలు సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా విభజన నోటిఫికేషన్ విడుదల తర్వాత అటు ఇటు కాకుండా అయ్యామని ఇప్పుడు పరిపాలనను గాడిలో పెట్టాలని సూచించారు. మండపేట నియోజకవర్గంలోని అన్ని శాఖలతో సమీక్ష సమావేశం నిర్వహించి గ్రామాలు, టౌన్ లో వున్న సమస్యలన్నింటిని పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా గత వైసీపీ హయాంలో జరిగిన భూ సర్వేపై విమర్శలు గుప్పించారు. అన్ని తప్పుల తడకగా ఉన్నాయన్నారు. భూ యజమానికి ఉన్న దస్తావేజులు పరిగణలోనికి తీసుకోకుండా ఎవరి ఆధీనంలో ఉంటే వారి పేరిట జారీ చేశారని ఆరోపించారు. దీనిపై తాను గతంలో డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానని వివరించారు.

రామచంద్రపురం డివిజన్‌లో ఇటువంటి తప్పులు సుమారు లక్ష వరకు ఉన్నట్లు అక్కడి అధికారులు తెలిపారని పేర్కొన్నారు. ఇప్పుడు గ్రామాల వారిగా ఈ తప్పులన్నీ సరిదిద్దాలని కోరారు. 2022 జిల్లాల పునర్విభజనలో తాము ఎన్ని ఆందోళనలు చేసిన అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదని పేర్కొన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక విలీనం సాధ్యమైందని తెలిపారు. ఇక్కడి ప్రజలకు రాజమహేంద్రవరంతో ఉన్న అనుబంధాన్ని వివరించారు. నియోజకవర్గంలో రూ.7కోట్లుతో రహదారులు మరమ్మత్తులు చేపడతామని పేర్కొన్నారు. తాపేశ్వరం బైపాస్, మారేడుబాక నుండి పెద్ద కాల్వ వంతెన వరకు రహదారి అభివృద్ధి చేసి వంతెన నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. మండపేట నియోజకవర్గం తూర్పుగోదావరి జిల్లాలోని మిగిలిన నియోజకవర్గాల కంటే వెనుకబడి ఉందన్నారు. ఈ నియోజకవర్గాన్ని ముందజలో తీసుకువెళ్లాలని కోరారు.

## టూరిజం హబ్‌గా ఆత్రేయపురం పరిసర ప్రాంతాలు

**●డ్రాగన్ పడవ పోటీలకు సంబంధించి కయాకింగ్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**



కొత్తపేట (చైతన్యరథం): జనవరి 11,12,13 తేదీల్లో జరిగే డ్రాగన్ పడవల పోటీలకు సంబంధించి ఆత్రేయపురం మండలం తాడిపూడి వంతెన వద్ద శుక్రవారం జరిగిన కయాకింగ్ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్, ఎస్పీ రాహుల్ మీనా, ఆర్డీవో పి శ్రీకర్, ఆకుల రామకృష్ణ, ముదునూరి వెంకటరాజులతో కలిసి పాల్గొన్నారు. పులిదిండి నుంచి తాడిపూడి వంతెన వరకు పడవ మీద ప్రయాణించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పోటీలకు వన్నె తెచ్చే విధంగా జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ స్వయంగా కయాకింగ్ కార్యక్రమంలో పాల్గొనడం స్ఫూర్తిదాయకమని ప్రశంసలు కురిపించారు. గత సంవత్సరం జరిగిన పోటీలు ప్రపంచవ్యాప్తంగా మంచి పేరును తీసుకువచ్చాయన్నారు. ఈ సంవత్సరం ఈ పోటీలను మరింత రెట్టింపు ఉత్సాహంతో మరింత బాగా నిర్వహించడానికి సన్నద్ధమయ్యామన్నారు. కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్, ఎస్పీ రాహుల్ మీనా, ఆర్డీఓ పి శ్రీకర్, టూరిజం అధికారులు, ఎన్డీఏ కూటమి నాయకులు ఇందుకు సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తున్నారని కొనియాడారు. వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. బొబ్బర్లంక నుంచి లొల్ల లాకుల వరకూ రెండున్నర లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే మెయిన్ కెనాల్ ఇక్కడ ఉండడం మన అదృష్టమన్నారు. ఈ కెనాల్ లో వాటర్ స్పోర్ట్స్‌ని, డ్రాగన్ పడవల పోటీలను ఏర్పాటుచేసి భవిష్యత్తులో పెద్ద టూరిజం హబ్‌గా ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దడానికి చేస్తున్న ప్రయత్నాలన్నీ తప్పక ఫలిస్తాయని తెలిపారు. అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని సంక్రాంతి సంబరాలను విజయవంతం చేయాలని కోరారు.

## రాజముద్రతో పాస్‌బుక్‌లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ముప్పిడి



కొవ్వూరు (చైతన్యరథం): వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్మోహన్‌రెడ్డి తన ఫోటోను పాస్ పుస్తకాలపై ముద్రించి, ప్రజల ఆస్తిని తన వ్యక్తిగత ఆస్తిలా భావించిన తీరు రైతులు, ప్రజలను తీవ్రంగా బాధించిందని... అందుకే రైతులే తిరగబడ్డారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడే, అధికారంలోకి వచ్చిన వెంటనే రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలను రైతులకు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీని కూటమి ప్రభుత్వం ఈరోజు నెరవేర్చిందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. తాళ్లపూడి మండలం తాడిపూడి గ్రామంలో కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... దోచుకునేందుకే జగన్ ప్రజల ఆస్తులు కొట్టేసేందుకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకొచ్చారని అన్నారు. అనంతరం కొవ్వూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజా దర్బార్ (గ్రీవెన్స్) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పలు సమస్యలతో 10 వినతి పత్రాలను అందించారు. పింఛన్లు కొరకు, రెవెన్యూ సమస్యలపై ఇచ్చిన వారి సమస్యల తక్షణ పరిష్కారం దిశగా సంబంధిత అధికారులకు ఫోన్ చేసిన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మద్దిపట్ల శివరామకృష్ణ, టౌన్ టీడీపీ ప్రెసిడెంట్ అర్దిల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నేతపై వైసీపీ నేతల హత్యాయత్నం



గుడివాడ (చైతన్యరథం): కృష్ణా జిల్లా గుడివాడ గుడ్‌మెన్ పేటలో టీడీపీ నేతపై వైసీపీ నేతలు హత్యాయత్నానికి పాల్పడ్డారు. గుడ్‌మెన్‌పేట సెంటర్‌లో టీడీపీ నేత వేశపోగు ఇమ్మానుయేలుపై కత్తులు, రాళ్లతో మూకుమ్మడిగా దాడి చేశారు. అడ్డుకోవడానికి ప్రయత్నించిన స్థానికులపై కూడా కత్తులతో దాడికి దిగారు. ఈ ఘటనలో ఇమ్మానుయేల్‌తో పాటు మరో ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానికులు హుటాహుటిన గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. గత రాత్రి నూతన సంవత్సర వేడుకల్లో.. వైసీపీ నేత రాజేష్ జరిగిన స్వల్ప ఘర్షణకు కొనసాగింపుగా ఈ దాడి జరిగిందని స్థానికులు చెబుతున్నారు. గుడివాడ టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వైసీపీ నాయకుల నుంచి ప్రాణహాని ఉందని ఇమ్మానుయేలు ఆరోపించారు. దాదాపు 15 మంది తనపై దాడి చేశారని, వైసీపీ నేతలు రాజేష్, ఎలీషా ప్రోత్బలంతోనే దాడి జరిగిందని తెలిపారు. బాధితులను కూటమి నాయకులు పరామర్శించారు.

## ఏజెన్సీల పనితీరుపై స్వచ్ఛాంధ్ర చైర్మన్ పట్టాభిరామ్ అసంతృప్తి



అమరావతి (చైతన్యరథం): స్వచ్ఛాంధ్ర విజన్ -2047లో భాగంగా రాష్ట్రంలో పారిశుద్ధ్యానికి సంబంధించి అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించేందుకు మునిసిపల్, పంచాయతీ సిబ్బందికి, వివిధ సంస్థల వారికి, విద్యార్థులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించే ఏజెన్సీల పనితీరుపై స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అమరావతిలోని తన కార్యాలయంలో కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ శుక్రవారం ఉదయం, సాయంత్రం ఏఐఐఎల్ఎస్‌జీ (ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్), వాష్ ఇన్‌స్టిట్యూట్ ఏజెన్సీలవారితో వేరువేరుగా సమావేశమై ఇప్పటి వరకు జరిగిన కార్యక్రమాలను సమీక్షించారు. తాము 13 జిల్లాలలోని 70 మునిసిపాలిటీలలో మూడు ఫేజులుగా సీబీ, ఐఈసీ(కెపాసిటీ బిల్డింగ్, ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్) కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏఐఐఎల్ఎస్‌జీ ఏజెన్సీ రీజినల్ డైరెక్టర్ వి.చలపతి రాజ్ చెప్పారు. మన్యం, విజయనగరం, కృష్ణ, శ్రీకాకుళం, చిత్తూరు, బాపట్ల, నెల్లూరు, పల్నాడు, ఎన్టీఆర్, అన్నమయ్య, ప్రకాశం, తిరుపతి, కడప జిల్లాలలో తాము అవగాహన కల్పించేవారిని 12 కేటగిరీలుగా విభజించినట్లు చైర్మన్‌కు వివరించారు. ఇప్పటి వరకు 42 మునిసిపాలిటీలలో 86 ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ ద్వారా 4,562 మందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. మునిసిపాలిటీలు, పాఠశాలల్లో పారిశుద్ధ్యం, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించడం... వంటి విషయాలలో శిక్షణ ఇచ్చి, వారికి అవగాహన కల్పించినట్లు వివరించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి, వారికి బహుమతులు కూడా ఇస్తున్నట్లు తెలిపారు.

**చైర్మన్ పట్టాభిరామ్ సూచనలు**

నాలుగు నెలల్లో జరిగిన శిక్షణా కార్యక్రమాల తీరుపై కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ఫొటోల వంటి కార్యక్రమాల ద్వారా మనల్ని మనం మోసం చేసుకోవద్దని హితవు పలికారు. ఫలితాలపై దృష్టి సారించాలన్నారు. కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నందున, అందుకు తగిన ఫలితాలు కనిపించాలని చెప్పారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను సమర్థవంతంగా అన్ని వర్గాల ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు చేపట్టవలసిన కార్యక్రమాల గురించి దిశానిర్దేశం చేశారు. శిక్షణ పొందినవారికి ఎంతవరకు అవగాహన అయిందో కూడా తెలుసుకోవాలని, వారి అవగాహనా సామర్థ్యాన్ని తెలుసుకోవడానికి, శిక్షణ తర్వాత వారికి పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. పరీక్షల్లో అధిక మార్కులు వచ్చిన వారికి బహుమతులు కూడా ఇవ్వాలన్నారు. స్వచ్ఛాంధ్రా లక్ష్యాలు, పారిశుద్ధ్యంపై మనం ప్రచారం చేసే అంశాలు ప్రజల్లోకి వెళ్లాలంటే మనం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కళాకారుల ద్వారా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. అలాగే, సోషల్ మీడియా ద్వారా ప్రజలను ప్రభావితం చేసేవారితో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి వారిని కూడా ఉపయోగించుకోవాలన్నారు. హోటల్స్, ట్రేడర్స్... వంటి ఇతర వ్యాపార సంస్థల అసోసియేషన్ల వారిని సమావేశపరిచి, వారి ద్వారా కూడా మన లక్ష్యాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయాలు, ఇతర విద్యా సంస్థలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, పదవీ విరమణ చేసినవారు, వివిధ సేవాదళాల ద్వారా కూడా పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలని చెప్పారు.

## ఏ సమస్య వచ్చినా వెంటనే తెలియజేయండి



పార్వతీపురం (చైతన్యరథం): మీరు విన్నవించిన ప్రతి సమస్యకు పరిష్కారం చూపిస్తాం సమస్య మీది పరిష్కారం మాది.. ప్రజలకు హామీ ఇచ్చిన ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర గ్రామంలో ఏ సమస్య వచ్చినా తెలియజేసిన వెంటనే పరిష్కారం చూపిస్తానని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర హామీ ఇచ్చారు. శుక్రవారం సీతానగరం మండలం కోటిసీతారాంపురం గ్రామంలో పర్యటించిన ఆయనకు ప్రజలు ఇళ్ల స్థలాలు, ఇల్లు, పెన్షన్లు, రేషన్ కార్డులు, బ్యాంకు రుణాలు వంటి సమస్యలపై వినతులు అందించారు. ఈ సందర్భంగా స్పందించిన ఎమ్మెల్యే ఆయా శాఖల అధికారులతో తక్షణమే మాట్లాడి కొన్ని సమస్యలు పరిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడానికి అధికారులు ముందుండాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు.

## ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఎంపీ కేశినేని శివనాథ్ కృషి



విజయవాడ (చైతన్యరథం): ఎన్టీఆర్ జిల్లాలోని నేషనల్ హైవే సమస్యలన్నీ త్వరలోనే పరిష్కారం అవుతాయని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. మచిలీపట్నంలోని ఎంపీ వల్లభనేని బాలశౌరి కార్యాలయంలో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, మోర్త్ ప్రాజెక్ట్ డైరెక్టర్లతో శుక్రవారం ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రజాప్రతినిధులునిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ మేరకు ఎంపీ కేశినేని శివనాథ్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశంలో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, మోర్త్ ప్రాజెక్ట్ డైరెక్టర్లతో ఎంపీ కేశినేని శివనాథ్, ఎంపీ బాలశౌరి, మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోడే ప్రసాద్, వెనిగండ్ల రాము, మండలి బుద్ధప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్, వర్ల కుమార్‌రాజా, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ ఉమ్మడి జిల్లాలోని జాతీయ రహదారుల అభివృద్ధిపై చర్చించారు. ఎన్టీఆర్ జిల్లాలోని జాతీయ రహదారుల అభివృద్ధి, ట్రాఫిక్ సమస్యలు, భద్రతా అంశాలపై పలు కీలక ప్రతిపాదనలు చేయటంతో పాటు ఆ అంశాలపై చర్చించనట్లు తెలిపారు. విజయవాడ కృష్ణలంక ప్రాంత వాసులు రోడ్డు దాటే సమయంలో తరచూ ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో, విజయవాడ కొత్త బస్టాండ్ వద్ద ఉన్న రాజీవ్ గాంధీ పార్క్ నుంచి బెంజ్ సర్కిల్ వరకు జాతీయ రహదారిపై ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాల్సిన అవసరం ఉందని మరియు కనకదుర్గమ్మ వారధి వద్ద హైదరాబాద్, చెన్నై, కొల్‌కత్తా నుంచి వచ్చే వాళ్లకి ఎలివేటెడ్ కారిడార్ నుంచి ఎగ్జిట్, ఎంట్రీ ఇవ్వాల్సిందిగా ఎంపీ కేశినేని శివనాథ్ ప్రతిపాదించారు. అలాగే బెంజ్ సర్కిల్ నుంచి గోసాల వరకు సుమారు 10 కిలోమీటర్ల పొడవున ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం చేపట్టాలని ప్రతిపాదించారు. ఎన్.హెచ్-65 నుంచి ఎన్.హెచ్-16ను కలుపుతూ కంకిపాడు నుంచి కేసరపల్లి, నిడమానూరు నుంచి పోరంకి, తాడిగడప నుంచి ఎనికెపాడు వరకు మూడు స్పర్ రోడ్ల నిర్మాణ ప్రతిపాదనలపై కూడా సమీక్ష సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది. ఎన్టీఆర్ జిల్లా ప్రజల రవాణా అవసరాలు, రోడ్డు భద్రత, నగర ట్రాఫిక్ సమస్యల శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా ఈ ప్రతిపాదనలు చేశామని ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు.

## అన్నదాతల బతుకులు మార్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

• సత్తెనపల్లి రెంటపాళ్ళ గ్రామంలో పట్టాదారు పాస్‌బుక్‌లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కన్నా



సత్తెనపల్లి (చైతన్యరథం): వ్యవసాయం లాభసాటి కావాలని అన్నదాతలు బతుకులు మారాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ వ్యాఖ్యానించారు. శుక్రవారం సత్తెనపల్లి రూరల్ మండలం, రెంటపాళ్ళ గ్రామంలో రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌బుక్‌లు రైతులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... జగన్ హయాంలో అరాచక, రాక్షస పాలన సాగిందని, గత ప్రభుత్వంలో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. జగన్ ప్రభుత్వం భూకబ్జాలు చేసిందని, తమ సొంత భూముల పట్టాదారు పాస్ పుస్తకాలపై జగన్ ఫోటో వద్దన్న రైతుల కోరిక మేరకు, ప్రభుత్వ రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. గతంలో పట్టాదారు పాసుపుస్తకం పైనే కాకుండా, సరిహద్దు రాళ్లపై కూడా జగన్ రూ.700 కోట్ల ప్రజా ధనంతో తన ఫోటో వేసుకున్నాడు. రాష్ట్రంలో అందరి ఆస్తులు, హక్కులు తనవేనని భావించిన జగన్... పాట్టదారుపాసు పుస్తకాలపై దేశంలో ఎక్కడలేని విధంగా జగన్ ఫోటోలు వేశారు. జగన్‌కు పిచ్చిముదిరి సరిహద్దు రాళ్లపై జగన్ బొమ్మలు వేసిన పరిస్థితి. వైసీపీ హయాంలో తమ ఆస్తులు తమవేమని చెప్పుకునే పరిస్థితి లేకుండా చేసే ప్రయత్నం. అరాచక పాలనకు ప్రజలు బుద్ది చెప్పారు. జగన్ రెంటపాళ్ల పర్యటనలో రప్పారప్పా నరుకుతాం అంటూ వైసీసీ సైకలు ఫ్లకార్డులతో ప్రదర్శన చేయడం దుర్మార్గమన్నారు. అధికారంలోకి వస్తే తలలు నరుకుతం అనే వ్యాఖ్యలు సరికాదని, ప్రజాపరిపాలనకు జగన్ అనర్హుడు అని అన్నారు. అరాచక శక్తులపై ఎన్నికల కమిషనర్ చర్యలు తీసుకోవాలన్నారు.

## ప్రజల ఆస్తుల జోలికి వెళ్లడమే జగన్ చేసిన అతి పెద్దతప్పు

◆ల్యాండ్ టైటిల్ యాక్ట్‌పై జగన్ మోజు.. వైసీపీని ఫ్యాక్స్‌కు దూరం చేసింది : ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట (చైతన్యరథం): రాష్ట్రమే తన జాగీర్ అన్నట్టు తలతిక్క నిర్ణయాలు తీసుకున్న జగన్ వైఖరిని, వారసత్వంగా తమకు సంక్రమించిన భూముల పాసుపుస్తకాలు, సర్వేరాళ్లపై తన బొమ్మలు వేసుకోవాలన్నఆయన ప్రచారపిచ్చిని ప్రజలు భరించలేకపోయారని, అందుకే సమయం చూసి వైసీపీని సాగనంపారని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. ప్రభుత్వ రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పుస్తకాల పంపిణీలో కార్యక్రమంలో పాల్గొన్న ప్రత్తిపాటి.. చిలకలూరిపేట మండలం గొట్టిపాడు, యడ్లపాడు మండలం ఉన్నవ, నాదెండ్ల మండలం అప్పాపురం గ్రామాల రైతాంగానికి, కూటమినాయకులతో కలిసి కొత్త పాసుపుస్తకాలు అందచేశారు. ఈ సందర్భంగా గ్రామస్తుల్ని ఉద్దేశించి, కార్యక్రమానంతరం విలేకరులతో ప్రత్తిపాటి మాట్లాడారు.

**భూ హద్దుల వివరాలు.. ఇతరత్రా పూర్తి సమాచారంతో ప్రభుత్వ రాజముద్రతో నూతన పాసు పుస్తకాలు**

భూముల హద్దులకు సంబంధించిన పూర్తి సమాచారంతో పాటు, మ్యాప్‌తో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాల్ని ప్రభుత్వ రాజముద్రతో రైతాంగానికి అందించాలన్న చంద్రబాబు నిర్ణయం తిరుగులేనిదని ప్రత్తిపాటి పేర్కొన్నారు. భవిష్యత్‌లో కూడా భూ యజమానులకు ఎలాంటి సమస్యలు రాకుండా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా వ్యవహరించిందన్నారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ చొరవతో అధికారులు అన్ని వివరాలు, భూమి హద్దుల్ని తెలిపే మ్యాప్‌తో కూడిన పట్టాదారు పాసుపుస్తకాల్ని అందచేస్తున్నారని, గతంలో ఉన్న రెండు పాసు పుస్తకాల స్థానంలో ఒక్కటే అందచేస్తున్నారని ప్రత్తిపాటి పేర్కొన్నారు.

**తన ఫోటోలు.. తన పార్టీ రంగులుండాలన్న పిచ్చి నిర్ణయాలే జగన్‌కు చేటు చేశాయి**

జగన్ ప్రచారపిచ్చి.. ల్యాండ్ టైటిల్ యాక్ట్‌పై ఆయన మోజే. వైసీపీని వాస్తవాలకు (ఫ్యాక్ట్స్) కు దూరం చేసి, 11 స్థానాకలు పరిమితం చేసిందని ప్రత్తిపాటి తెలిపారు. ప్రతి పథకం. ప్రతి కార్యక్రమంలో తన ఫోటోలే ఉండాలనే పిచ్చితో పాటు. భవనాలకు పార్టీ రంగులు వేయాలనే మరో నిర్ణయమే జగన్‌కు చేటుచేసి, ఇప్పుడు ప్యాలెస్‌లకు పరిమితం చేసిందని ప్రత్తిపాటి ఎద్దేవా చేశారు. పూర్వీకుల నుంచి వారసత్వంగా సంక్రమించిన భూముల్లో వేలు పెట్టి, ప్రజల ఆస్తులు, ప్రభుత్వ భూముల్ని కాజేయాలని చూసినందుకే వైసీపీ భారీ మూల్యం చెల్లించుకుందన్నారు. ప్రతి రోజూ పండగనేలా చంద్రబాబు నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజలకోసం పనిచేస్తోందని ప్రత్తిపాటి తెలిపారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్

◆ పాల్గొన్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండ (చైతన్యరథం): పట్టణంలోని ప్రభుత్వ చీఫ్ విప్ కార్యాలయంలో ప్రజా దర్బార్‌లో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని పలు మండలాల నుండి ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రజల విజ్ఞప్తులను సావధానంగా ఆలకించిన జీవీ ఆంజనేయులు... వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని, ప్రతి ఒక్కరి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజాదర్బార్ ద్వారా ప్రజలకు మరింత చేరువయ్యే అవకాశం లభిస్తుందని, వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడం వల్ల సత్వర పరిష్కారం సాధ్యమవుతుందని ఆయన అన్నారు. జనసేన నాయకులు నాగ శ్రీను రాయల్, నిశంకర్ శ్రీనివాసరావు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం: ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్



గన్నవరం (చైతన్యరథం): నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే తన ప్రథమ కర్తవ్యమని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు స్పష్టం చేశారు. రాజకీయాలు కేవలం ఎన్నికల సమయానికే పరిమితమని, గెలిచిన తర్వాత కేవలం అభివృద్ధిపైనే తన దృష్టి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం గన్నవరం మండలంలోని కొత్తగూడెం, తెంపల్లె గ్రామాల్లో ఆయన పర్యటించారు. 'పల్లె పండుగ 2.0' కార్యక్రమంలో భాగంగా రూ.85 లక్షల వ్యయంతో నిర్మించిన రెండు సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను ఆయన ప్రారంభించారు. అలాగే రూ.1.85 లక్షలతో నిర్మించిన గోకులం షెడ్‌ను ప్రారంభించడంతో పాటు, రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న మరో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం రీ-సర్వే గ్రామ సభలో పాల్గొన్న ఎమ్మెల్యే, రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన కొత్త పట్టా పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎమ్మెల్యే మాధవి



గుంటూరు (చైతన్యరథం): గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గళ్ళా మాధవి నిర్వహించారు. ప్రజల సమస్యలు, వారి అర్జీల స్వీకరణ, సత్వర పరిష్కారం ఇవన్నీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న గ్రీవెన్స్ డేలో భాగమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. ప్రజల అర్జీలు స్వీకరించి, సంబంధిత శాఖలకు అనుసంధానం చేసి, వారికి తక్షణ ఉపశమనం కలిగించేందుకు అన్ని ప్రజా ప్రతినిధులు కృషి చేస్తున్నారని చెప్పారు. నియోజకవర్గంలో ప్రతి శుక్రవారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తూ, సమస్యలు పూర్తిగా పరిష్కారం అయ్యే వరకు ఫాలో అప్ చేస్తామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

## 2026 డైరీ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన చైర్మన్ దేగల



గుంటూరు (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యాలయంలో 2026 డైరీ, క్యాలెండర్‌ను చైర్మన్ దేగల ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ దేగల ప్రభాకర్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏపీఐడీసీని ఎంతగానో ప్రోత్సహించారని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీఐడీసీను పూర్తిగా నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. 2006 నుంచి కార్పొరేషన్ కొన్ని అనివార్యకారణాల వల్ల కార్పొరేషన్ యొక్క యాక్టివిటీ ఆగిపోవడం జరిగిన్నారు. కూటమి ప్రభుత్వం ఏపీఐడీసీకి పూర్వవైభవం తీసొకొచ్చేందుకు సమిష్టిగా కృషి చేస్తున్నామన్నారు. రానున్నరోజుల్లో సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయంతో నూతనంగా ప్రారంభించబోయే పరిశ్రమలను, పారిశ్రామికవేత్తలకు లోన్లను ఇచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ఉంచుతామన్నారు.





# సామాజిక సేవతోనే ప్రజా జీవితానికి సార్థకత

**సర్వేపల్లి లో కూడా విపిఆర్ నేత్ర సేవలు ప్రారంభిస్తాం, ముంగలదొరువులో వీపీఆర్ అమృతధార ప్లాంట్‌ను ప్రారంభించిన ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి**

సర్వేపల్లి, (చైతన్యరథం): వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేయడం తనకు సంతృప్తిని ఇస్తుందని నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం సర్వేపల్లి నియోజకవర్గం టీపీ గూడూరు మండలం ముంగలదొరువు గ్రామంలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వీపీఆర్ అమృత ధార వాటర్ ప్లాంట్‌ను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ, టీపీ జిల్లా పార్టీ అధ్యక్షులు బీద రవిచంద్రతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందరరేగా ప్రభుత్వ రాజముద్రతో నూతనంగా తీసుకువచ్చిన పట్టాదారు పాసుపుస్తకాలను ఆయా రైతులకు అందజేశారు. తొలుత గ్రామానికి వచ్చిన నేతలకు కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ను ప్రారంభించి పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేశారు. ఈ సందరరేగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ 2026 నూతన సంవత్సరాన్ని సేవా కార్యక్రమాలతో మొదలు పెడుతుండటం మరింత ఉత్సాహాన్ని ఇస్తోందన్నారు. ఈ వారంలో 19 వాటర్ ప్లాంట్స్ ప్రారంభిస్తామన్నారు. ఈ ప్రారంభోత్సవాలు విపిఆర్ ఫౌండేషన్ సమర్థతకు, సేవా రూపానికి నిదర్శనమని చెప్పారు. ప్రజలకు ఇలా సేవ చేసే అద ృష్టం ఇచ్చిన ఆ భగవంతుడికి, ప్రజలకు ఎప్పుడూ రుణపడి ఉంటానన్నారు. సర్వేపల్లిలో ఇప్పటివరకు 8 ప్లాంట్లు ఏర్పాటు చేశామన్నారు. వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవంలో సర్పంచి కవిత ఎమోషనల్ అవడం పై ఎంపీ స్పందించారు. గ్రామాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఇలాంటి వారు మళ్లీ ఎన్నిక కావాలని ఆయన ఆకాంక్షించారు. కలువాయి, సైదాపురం, రాపూరు మండలాలను, గూడూరు నియోజకవర్గంలోని మూడు మండలాలను నెల్లూరు జిల్లాలో కొనసాగించడంపై సీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలియజేశారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సహకారంతో ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఈ సందర్భంగాయన స్పందించి వీటిని కొనసాగించేలా చేశారన్నారు. వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా వ్యాప్తంగా 1050 మంది దివ్యాంగులకు ఉచితంగా ట్రై సైకిల్స్ అందజేశామన్నారు. ఇప్పుడు విపిఆర్ నేత్ర కార్యక్రమం ద్వారా గ్రామీణలకు కంటి పరీక్షలు చేయిస్తున్నామని ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లో దాదాపు పదివేల మంది పరీక్షలు చేయగా 6000 మందికి ఉచితంగా కంటి అద్దాలు అందజేశామన్నారు. సర్వేపల్లి లో కూడా సేవలందిస్తామన్నారు. తాను గతంలో వైసీపీలో ఉండి తప్పు చేశానని, ఈరోజు ఆ దేవుడి దయవల్ల టీడీపీలోకి చేరనన్నారు. మంచి మనస్తత్వం ఉన్న నాయకుల ఆధ్వర్యంలో పనిచేయడం ఆనందంగా ఉందని చెప్పారు. నెల్లూరు జిల్లా అధ్యక్షుడిగా అనుభవం ఉన్న బీద రవిచంద్ర అందరినీ కలుపుకొని వెళుతున్నారనీ, ప్రతి కార్యక్రమంలో పాల్గొంటూ ముందుకు సాగుతున్నారన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో సోమరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వంటి అనుభవం ఉన్న ఎమ్మెల్యే ఉండడం ప్రజల అద ృష్టమని, అన్ని విధాల అభివ ృద్ధి చేస్తూ ముందుకు సాగుతున్నారన్నారు. వంశీధర్ రెడ్డి బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షుడుగా మంచి ప్రతిభ చూపుతున్నారని ప్రశంసించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో పనిచేస్తుండడం తమకు గర్వకారణమని వెల్లడించారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ పీవీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమృతధార వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడమే కాకుండా నిర్వహణ చేపట్టడం గొప్ప విషయమన్నారు. వీపీఆర్ నేత్ర ద్వారా కంటి అద్దాలు అందజేస్తున్నారని స్పష్టం చేశారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి లాంటి వ్యక్తిగా అరుదుగా ఉంటారని చెప్పారు. విపిఆర్ గారి సహాయ సహకారాలతో సైదాపురం, రాపూరు, కలువాయి, గూడూరులోని మూడు మండలాలు నెల్లూరులో కొనసాగుతునాయని అన్నారు. నెల్లూరు జిల్లాలో గిరిజనుల సమగ్ర అభివ ృద్ధికి కేంద్రం దృష్టికి తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. తమ ఆధ్వర్యంలో 3,000 మంది గిరిజనులకు ఆధార్ కార్డులు ఇప్పించామని, గిరిజనుల అభివ ృద్ధికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ఫోటోతో పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చిందని, రైతుల భూమిని తన భూములుగా ఫోటో వేయించుకోవడం దారుణం అన్నారు. గత ప్రభుత్వ తప్పిదాలను సీఎం చంద్రబాబు గారు సరి చేస్తూ కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేస్తున్నారని స్పష్టం చేశారు. రైతుల నోర్లు కొడతామంటే కుదరదని చెప్పారు. ఎమ్మెల్సీ, టీడీపీ పార్టీ జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర మాట్లాడుతూ విద్య, వైద్యం, వాటర్ ప్లాంట్, ట్రై సైకిల్స్ ఏర్పాటుతో పేదల అభ్యున్నతికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రస్తుతం ఉదయగిరిలో నిర్వహిస్తున్న విపిఆర్ నేత్ర సేవలను ఉమ్మడి నెల్లూరు జిల్లా వ్యాప్తంగా నిర్వహించేందుకు వీపీఆర్ నిర్ణయం తీసుకోవడం సంతోషకరమని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు మంచి పాలనందుతోందని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు వంశీధర్ రెడ్డి, నెల్లూరు రీజియన్ ఆర్టీసీ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి, ఏపీ ఇన్లాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ డాక్టర్ జెడ్ వ్రప్రసాద్ జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ సురేష్, సర్పంచ్ కవిత, టీడీపీ నాయకులు కేతన్ రెడ్డి వినోద్‌రెడ్డి, జనసేన నాయకులు గుడి హరిరెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏపీ టీడీసీ నూతన సంవత్సరం 2026 వేడుకలు

**పాల్గొన్న చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ**

విజయవాడ, (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్పొరేట్ కార్యాలయంలో నూతన సంవత్సరం 2026 సందర్భంగా వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో ఏపీటీడీసీ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ చైర్మన్ ఛాంబర్‌లో సంస్థ ఉద్యోగులతో కలిసి నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. చైర్మన్ డాక్టర్ నుకసాని బాలాజీ కేక్ కట్ చేసి, కార్పొరేట్ కార్యాలయంలో పనిచేస్తున్న అన్ని ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గత సంవత్సరంలో ఏపీటీడీసీ ఉద్యోగులు చూపిన కృషి అంకితభావం ప్రశంసనీయమని పేర్కొన్నారు. 2026 నూతన సంవత్సరంలో కూడా అదే నిబద్ధతతో, మరింత బాధ్యతాయుతంగా పనిచేసి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు ప్రతి ఉద్యోగి సమిష్టిగా కృషి చేయాలని ఆయన సూచించారు. రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధిలో ఏపీటీడీసీ కీలక పాత్ర పోషిస్తోందని, ఉద్యోగుల సహకారంతో సంస్థను మరింత ముందుకు తీసుకెళ్లవచ్చని నూకసాని బాలాజీ తెలిపారు.

ఈ కార్యక్రమంలో భవానీ ఐలాండ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమా మహేశ్వరరావు, ఏపీటీడీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) శేషగిరి, చీఫ్ ఇంజనీర్ వెంకట రమణ, సూపరింటెండింగ్ ఇంజనీర్ ఈశ్వరయ్య, జనరల్ మేనేజర్లు పార్థసారథి, నంచారయ్య, పి. మహేష్ బాబు, ఏబీవీ సుధీర్‌తో పాటు కార్పొరేట్ కార్యాలయానికి చెందిన ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.






## మినీ అంగన్‌వాడీలకు పదోన్నతి

**39 మందికి ఉత్తర్వులను అందజేసిన ఎమ్మెల్యే ముత్తుముల**

గిద్దలూరు, (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని గిద్దలూరు శాసనసభ్యుడు ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీలుగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో, నియోజకవర్గంలోని లబ్ధిదారులకు పదోన్నతి పత్రాలను ఆయన పంపిణీ చేశారు. శుక్రవారం సాయంత్రం గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గిద్దలూరు, బెస్తవారిపేట మండలాలకు చెందిన 39 మంది మినీ అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పదోన్నతి పత్రాలు అందజేశారు. ఈ సందరరేగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీల పట్ల అత్యంత సానుకూలంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీలు కోరిన 15 ప్రధాన డిమాండ్లలో ఇప్పటికే 13 డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చిందని ఆయన స్పష్టం చేశారు. తమ సమస్యల పరిష్కారానికి క ృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, ఎమ్మెల్యే అశోక్ రెడ్డికి అంగన్‌వాడీ కార్యకర్తలు క ృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ అధికారులు, గిద్దలూరు మున్సిపల్ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, కంభం మార్కెట్ యార్డ్ చైర్మన్లు బైలడుగు బాలయ్య, పూనూరు భూపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ గోడి ఓబుల్ రెడ్డి, గిద్దలూరు సొసైటీ బ్యాంకు చైర్మన్ దుత్తా బాల ఈశ్వరయ్య, కొమరోలు మండల పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు, కంభం జడ్పీటీసీ కొత్తపల్లె శ్రీను, పట్టణ కౌన్సిలర్లు లోక్కు రమేష్, బూనబోయిన చంద్రశేఖర్, షేక్ షేక్షావలి, పరుచూరి నాగేశ్వర రావు, సర్పంచ్ ఆవుల రాజగోపాల్, స్థానిక నాయకులు మరియు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# టీడీపీ ప్రస్థానంలో కార్యకర్తలే రియల్ హీరోలు



## ఉత్తమ కార్యకర్తలకు ప్రశంసాపత్రాల పంపిణీలో ఎమ్మెల్యే పల్లె

పుట్టపర్తి, (చైతన్యరథం): ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అధ్యక్షతన ఉత్తమ కార్యకర్తలకు ప్రశంసా పత్రాల పంపిణీ జరిగింది. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని, ప్రభుత్వం అమలు చేస్తున్న అభివ ృద్ధి, సంక్షేమాలను ప్రజల్లోకి తీసుకెళ్లినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కార్యకర్తలకు ప్రశంసా పత్రాలు ఇచ్చి మరింత ప్రోత్సహించాలని నిర్ణయించి ప్రశంసాపత్రాలను పంపిణీ జరిగిందని ఎమ్మెల్యే తెలియజేశారు.




## అంగన్వాడీ టీచర్లకు 5జీ స్మార్ట్ ఫోన్ల పంపిణీ

### కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

కావలి, (చైతన్యరథం): అంగన్వాడీ టీచర్ల సేవలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తూ మరో కీలక నిర?యం తీసుకుంది. కావలి నియోజకవర్గంలోని అంగన్వాడీ టీచర్లు, సూపర్వైజర్లకు శుక్రవారం కావలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 5జీ స్మార్ట్ ఫోన్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో పద్మజ, అంగన్వాడి అధికారులు, పార్టీ నాయకులతో కలిసి కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి చేతుల మీదుగా సుమారు 350 మంది అంగన్వాడీ టీచర్లు, సూపర్వైజర్లకు 5జీ స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ, పాత ఫోన్లలో నెట్వర్క్ సమస్యలు, సాంకేతిక ఇబ్బందుల కారణంగా అంగన్వాడీ టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటిని పూర్తిగా అధిగమించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కీలక నిర?యం తీసుకుందని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన 5జీ స్మార్ట్ ఫోన్లు అంగన్వాడీ సేవలను మరింత వేగవంతం చేస్తాయని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో కీలకంగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ గారి మార్గదర్శకత్వంలో అమలవుతోందని ఎమ్మెల్యే తెలిపారు. మహిళలు, చిన్నారుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం, అంగన్వాడీ వ్యవస్థను పూర్తిగా ఆధునీకరించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. అంగన్వాడీ టీచర్ల గురించి ప్రత్యేకంగా మాట్లాడిన ఎమ్మెల్యే కావ్య క ృషా?రెడ్డి గారు, "గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం, పోషణ, విద్య విషయంలో అంగన్వాడీ టీచర్ల పాత్ర అనిర్వచనీయమైనది. ప్రభుత్వ పథకాలకు వారే పునాది. ఎండా వానా తేడా లేకుండా సేవలు అందిస్తున్న అంగన్వాడీ టీచర్ల కృషి అమూల్యమైనది" అని కొనియాడారు. 5జీ స్మార్ట్ ఫోన్ల ద్వారా హాజరు నమోదు, డేటా అప్డేట్, ప్రభుత్వ ఆదేశాల తక్షణ అమలు, లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించడం సులభమవుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇది అంగన్వాడీ టీచర్ల పనిభారాన్ని తగ్గించి, సేవల నాణ్యతను పెంచుతుందని చెప్పారు.

## అన్నదాతలకు ఉచితంగా పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ

### కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బీవీఎన్ విజయకుమార్



చీమకుర్తి, (చైతన్యరథం): చీమకుర్తి మండలం గాడిపర్తివారి పాలెం రంగాసాయి పురం గ్రామంలో రెవిన్యూ పరిధిలోని రైతులందరికీ సంతనూతలపాడు నియోజకవర్గ శాసనసభ్యుడు బీఎన్విజయ్ కుమార్ ఉచితంగా పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో బ్రహ్మయ్య, ఏఎంసీ చైర్మన్ మన్నం ప్రసాద్, పార్లమెంట్ ఉపాధ్యక్షులు గొల్లపూడి సుబ్బారావు, పార్లమెంట్ ఎస్సి సెల్ సెక్రటరీ రంపతోటి అంకారావు, మండల పార్టీ అధ్యక్షులు గొట్టిపాటి రాఘవరావు, సొసైటీ చైర్మన్ గ్రామ పార్టీ అధ్యక్షులు జ్యోతి వేణు, మండల సెక్రటరీ ఇస్తార్ల ఏడుకొండలు, పుట్టా బ్రహ్మయ్య, తెలుగు యువత ఉపాధ్యక్షుడు గమిని ప్రసాద్, గమి కృష్ణారావు, గమిని ఆంజనేయులు సర్పంచ్, అదిబాబు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ

నల్లమాడ, (చైతన్యరథం): నల్లమాడ మండలం చౌటకుంటపల్లిలో అమడగూరు మండలం చీకిరేవులపల్లి గ్రామాలలో శుక్రవారం రెవిన్యూ అధికారుల ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టు భూమి పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి కూటమి పార్టీల ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులు రైతులు పాల్గొన్నారు.



# ప్రజలకు చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చాం : ఎంపీ వేమిరెడ్డి దంపతులు

## ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

కోవూరు, (చైతన్యరథం): ప్రజలకు చేసేందుకు రాజకీయాలలోకి వచ్చామని ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. ఎమెల్సీ జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీద రవిచంద్ర కలిసి విడవలూరు మండలం రామతీర్థం గ్రామంలో వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేసిన ఆర్ఓ వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన ఎంపీ వేమిరెడ్డి స్థానిక కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు. వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవ అనంతరం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, ఎమ్మెల్సీ జిల్లా టిడిపి అధ్యక్షులు బీద రవిచంద్రతో కలిసి ఆయన రైతులకు పట్టాదార్ పాస్ బుక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ తన ఎంపి పదవికున్న రెండు అక్షరాలు ఎమ్మెల్యేగా తన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పదవికి వున్న మూడు అక్షరాలు కలిపి ఎంపి, ఎమ్మెల్యే అనే అయిదు అక్షరాలు ప్రజాసేవకే అంకితమన్నారు. సమాజ సేవ కోసమే విపిఆర్ ఫౌండేషన్ స్థాపించామన్నారు. 2017 లో విపిఆర్ అమృత ధార పేరిట ఉదయగిరి ప్రాంతంలో తొలి ఆర్వో ప్రాంభించామని జిల్లా వ్యాప్తంగా 190 వాటర్ ప్లాంట్లు పెట్టి ప్రజల దాహార్తి తీరుస్తున్నామన్నారు. అత్యాధునిక వైద్య సదుపాయాలున్న ప్రత్యేక బస్సు సుశిక్షితులైన కంటి వైద్యుల బృందంతో ఉదయగిరి ప్రాంతంలోని వరికుంటపాడు మండలంలో వీపీఆర్ నేత్ర అనే కంటి వైద్యానికి సంబంధించిన ప్రజాహిత కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. కంటి సమస్యలు వున్న వారిని డాక్టర్లు పరీక్షించి దృష్టి లోపం ఉంటే అక్కడికక్కడే కంటి అద్దాలు తయారు చేసే వ్యవస్థ బస్సులో ఉందన్నారు. విపిఆర్ నేత్ర ద్వారా వరికుంటపాడు, ఉదయగిరి మండలాలలో గ్రామ గ్రామాలకు వెళ్లి 12 వేలకు పైగా దృష్టి లోపం వున్న వారిని పరీక్షించి 7 వేల మందికి కంటి అద్దాలు ఇచ్చామన్నారు. విపిఆర్ నేత్రకు సంబంధించి మరో బస్సు రెడీ అవుతుందని మరో రెండు నెలల్లో విపిఆర్ నేత్ర సెకండ్ ఫేస్ కోవూరు నియోజకవర్గం లోని రామతీర్థం నుంచే ప్రారంభిస్తామన్నారు. దివ్యాంగుల విన్నపం మేరకే ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్ళ కార్యక్రమాన్ని మొదలు పెట్టినట్టు ఎంపీ వేమిరెడ్డి గారు పేర్కొన్నారు. ఇప్పటి వరకు నెల్లూరు పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో వీపీ ఆర్ ఫౌండేషన్ ద్వారా 11 వందల మంది దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్ళు అందచేశామన్నారు. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేందుకు దివ్యాంగులకు ట్రై సైకిళ్లు ఉపయోగ పడుతున్నాయన్నారు. అనుభవజ్ఞులైన బీద రవిచంద్ర, చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి నాయకత్వంలో టిడిపి బలోపేతం అవుతుంది. నాయకుల మధ్య చిన్న చిన్న విభేదాలుంటే పరిష్కరించుకొని అందరు ఐకమత్యంగా వుండాలని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సూచించారు.



## రైతు బాంధవుడు ముఖ్యమంత్రి చంద్రబాబు

వాటర్ ప్లాంట్స్ ఏర్పాటు చేయడమే కాకుండా వాటి నిర్వహణ కూడా విపిఆర్ ఫౌండేషనే చూస్తుందని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ అన్నారు. 2017 లో ఉదయగిరిలో ప్రారంభించిన వాటర్ ప్లాంట్ నేటికీ కొనసాగుతుందన్నారు. మానవ సేవే మాధవ సేవ అన్న లక్ష్యంతో నిర్వహిస్తున్న విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన క్యాన్సర్ (స్కీనింగ్, ట్రై సైకిళ్ళ పంపిణి తదితర సేవా కార్యక్రమాల గురించి వివరించారు. ఎన్నికల సందర్భంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి రైతుల పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇళ్ల వద్దకే చేరుస్తామన్న హామిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆచరణలో అమలు చూపించారన్నారు. గత ఐదేళ్లుగా అస్తవ్యస్తమైన ఆర్థిక వ్యవస్థను చక్కదిద్ది సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పదలోనికి తీసుకుపోతున్నారన్నారు. గతమెన్నడూ లేని విధంగా వరికి గిట్టుబాటు ధర కల్పించడమే కాకుండా ధాన్య సేకరణ చేసిన 24 గంటలలో హమాలీ చార్జీలతో రైతుల ఖాతాలలో వేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రైతు సోదరులకు అండగా నిలుస్తున్న సిఎం చంద్రబాబు నాయుడుకి ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. వేమిరెడ్డి దంపతుల సేవా దృక్పధాన్ని ఎమ్మెల్సీ టీడీపీ అధ్యక్షులు బీదా రవిచంద్ర అభినందించారు. వీపీఆర్ ఫౌండేషన్ పేదల పాలిట పెన్నిధిగా ఎమ్మెల్సీ రవిచంద్ర అభివర్ణించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ప్రజా ప్రతినిధులుగా ప్రజలతో మమేకమై చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. వేమిరెడ్డి దంపతుల సారధ్యంలో నెల్లూరు పార్లమెంటరీ నియోజకవర్గం కోవూరు నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి, విడవలూరుటీడీపీ అధ్యక్షులు ఏటూరి శ్రీహరి రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, అడపాల శ్రీధర్ రెడ్డి, పాశం శ్రీహరి రెడ్డి, ఆవుల వాసు పూండ్ల అచ్యుత్ రెడ్డిలతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు టీడీపీ యూనిట్, క్లస్టర్ బూత్ కమిటీ కన్వీనర్లు పాల్గొన్నారు.



# ఈవీఎంలకే కన్నడిగుల ఓటు

**(కర్ణాటక మానిటరింగ్ అండ్ ఎవల్యూషన్ అథారిటీ సర్వేలో తేలిన నిజం, కంగుతిన్న కాంగ్రెస్, బీజేపీకి జోష్**



ఎన్నికల ప్రక్రియలో విశ్వసనీయత, ఈవీఎంల పనితీరుపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తరచూ అనుమానాలు వ్యక్తం చేస్తోన్న వేళ... కర్ణాకలో చేపట్టిన ఓ ప్రభుత్వ సర్వే ఫలితాలు చర్చనీయాంశంగా మారాయి. ఆ సర్వేలో రాష్ట్రంలోని మెజార్టీ ప్రజలు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఈవీఎం లను విశ్వసిస్తున్నట్లు తేలింది. దీంతో రాహుల్ గాంధీ పై భాజపా విమర్శలు గుప్పించింది. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికలపై కర్ణాటక ప్రభుత్వ ఏజెన్సీ కేఎంఈఏ (కర్ణాటక మానిటరింగ్ అండ్ ఎవల్యూషన్ అథారిటీ) గతేడాది ఆగస్టులో సర్వే నిర్వహించింది. ఆ - రిపోర్టును తాజాగా విడుదల చేసింది. దీని ప్రకారం.. ఈవీఎంలు విశ్వసించదగినవేనని 83. 61శాతం మంది వెల్లడించినట్లు తేలింది. ఇక ఈ యంత్రాలు ఖచ్చితమైన ఫలితాలను ఇస్తాయని 68.30 శాతం మంది అంగీకరించినట్లు నివేదిక తెలిపింది. దేశవ్యాప్తంగా ఎన్నికలు స్వేచ్ఛగా పారదర్శకంగా జరిగాయని 31.31 శాతం విశ్వసించినట్లు సర్వే పేర్కొంది. ఈ సర్వేలో 102 అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన దాదాపు 5100 మంది పాల్గొన్నారు. బెంగళూరు, బెళగావి, కలబురగి, మైసూరు డివిజన్లలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలను సర్వే చేసి ఈ నివేదిక రూపొందించారు. ఈ సర్వే ఫలితాలపై కర్ణాటక ప్రతిపక్ష నేత, భాజపా నాయకుడు ఆర్ అశోక్ స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. “భారత ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని, ఈవీఎంలు నమ్మదగినవి కావని గత కొన్నేళ్లుగా రాహుల్ గాంధీ ఒకే పాట పాడుతున్నారు. మన సంస్థలను ఆయన విశ్వసించడం లేదు. కానీ, ఆయన మాట తప్పని కర్ణాటక రుజువు చేసింది. ఎన్నికలను, ఈవీఎంలను, మన ప్రజాస్వామ్య ప్రక్రియను ప్రజలు నమ్ముతున్నారు. ఈ సర్వే కాంగ్రెస్‌కు చెంపపెట్టు. ప్రజాభిప్రాయం ఎలా ఉందో తెలిసినా... సిద్ధరామయ్య ప్రభుత్వం మాత్రం స్థానిక ఎన్నికలను బ్యాలెట్ విధానంలో నిర్వహిస్తామని ప్రకటించడం హాస్యాస్పదం. రాష్ట్రాన్ని వెనక్కి తీసుకెళ్లాలనుకుంటున్నారు” అని భాజపా నేత మండిపడ్డారు.

# కయ్యాలమారి.. మన పొరుగుదేశం!

**ఉగ్రవాదుల నుంచి ప్రజలను కాపాడుకునే బాధ్యత వహిస్తున్నాం: జైశంకర్**



ఉగ్రవాదం నుంచి తన ప్రజలను రక్షించుకొనే బాధ్యత భారత్‌కు ఉందని విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ అన్నారు. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ఎగదోసే కయ్యాలమారి మన పొరుగు దేశమని పేర్కొంటూ ఈ వ్యాఖ్య చేశారు. శుక్రవారం ఐఐటీ మద్రాస్లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి విద్యార్థులతో మాట్లాడారు. అలాగే ఆపరేషన్ సిందూర్ గురించి ప్రస్తావిస్తూ.. “మనం ఏం చేయాలో.. ఏం చేయకూడదో ఇతరులు నిర్ణయించలేరు అని తేల్చి చెప్పారు. “మీ పొరుగువారు చెడ్డవారు ఉండొచ్చు. దురదృష్ట వశాత్తూ మన దేశానికి ఉన్నారు. వారు ఉద్దేశపూర్వకంగా ఉగ్రవాదాన్ని ఎగదోస్తుంటే. ఆ ఉగ్రవాదం నుంచి ప్రజలను రక్షించుకునే హక్కు మనకుంది. మనం ఆ హక్కును వినియోగించుకుంటాం. దానిని ఎలా వాడతామనేది మన నిర్ణయించడం పైనే ఆధారపడి ఉంటుంది. అంతేకానీ ఆ అంశంలో ఇతరులు ఎవరూ తల దూర్చలేరు. మనల్ని మనం రక్షించుకోవడానికి మనం చేయాల్సిందంతా చేస్తాం” అని జైశంకర్ వెల్లడించారు.

# దొరికిన సరుకు కన్నా పోయిందే ఎక్కువ

**శబరిమల ఆలయ పునరుద్ధరణ పనుల్లో చోరీకి గురైన బంగారం**

శబరిమల ఆలయ పునరుద్ధరణ పనుల్లో చోరీకి గురైన బంగారంలో ఇప్పటివరకు దొరికినదానికంటే ఇంకా ఎక్కువే పోయి ఉంటుందని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అనుమానిస్తోంది. ముగ్గురు నిందితుల్ని తమ కస్టడీకి అప్పగించాల్సిందిగా కోరుతూ కొల్లం విజిలెన్స్ కోర్టుకు సమర్పించిన దరఖాస్తులో సిట్ ఈ అనుమానం వ్యక్తం చేసింది. 2019లో బంగారం పూత పూసిన రాగి రేకులను ఎలక్ట్రో ప్లేటింగ్ (విద్యుత్ సాయంతో బంగారు పూత పూయడం) కోసం స్మార్ట్ క్రియేషన్స్ సంస్థకు అప్పగించారని సిట్ తన పిటిషన్లో పేర్కొంది. ఆ ప్లేట్ల మొత్తం బరువు 12.100 కేజీలు కాగా ఎలక్ట్రోప్లేటింగ్ ప్రక్రియ పూర్తైన తర్వాత మిగిలిన బంగారాన్ని నిందితులు: మింగేశారని అభియోగం. ద్వారపాలక విగ్రహాల నుంచి, వాటికి సమీపంలోని రెండు స్తంభాల నుంచి బంగారం పూసిన రేకుల్ని తొలగించారని, గరగేడి ద్వారం నుంచి ఇలాంటి ఏడు రేకులు తొలగించి వాటికి బంగారు పూత తిరిగి పూశారని సిట్ కోర్టుకు తెలిపింది. గరగేడి నుంచి తొలగించిన ప్లేట్లలో రెండింటిపై విష్ణుమూర్తి దశావతారాలు చెక్కి ఉన్నాయని వివరించింది. ఎలక్ట్రో ప్లేటింగ్ అనంతరం ఉన్నికృష్ణన్ పొట్టి తనకు 474.90 గ్రాముల బంగారం ఇచ్చాడని గోవర్ధన్ అనే మరో నిందితుడు తెలియజేసి ఆమేరకు సిట్కు బంగారం అప్పగించాడు. ద్వారపాలక విగ్రహాలపై ఉన్న బంగారు పూసిన రాగి ప్లేట్లపై వాస్తవానికి ఇంకా ఎక్కువ పరిమాణంలో బంగారం ఉందని సిట్ వెల్లడించింది. వారు సోనియాను ఎలా కలిశారు? విజయన్ ఈ కేసులో బంగారాన్ని దొంగిలించిన వ్యక్తి, కొన్న వ్యక్తి కూడా కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీని ఎలా కలవగలిగారని ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రశ్నించారు. ఈ కేసు దర్యాప్తు కేరళ హైకోర్టు పర్యవేక్షణలో జరుగుతోందని, కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నట్లు తన కార్యాలయ జోక్యమేమీ లేదని స్పష్టంచేశారు. సిట్ దర్యాప్తుపై ఇంతవరకు ఎలాంటి ఫిర్యాదులు లేవన్నారు.



# హస్తినాపురిని కమ్మేసిన పొగమంచు

**గాలి నాణ్యత సూచీ 369గా నమోదైనట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వెల్లడి, పలు విమానాలు రద్దు**



దేశ రాజధాని ఢిల్లీని పొగమంచు కమ్మేసింది. దీనివల్ల విజిబిలిటీ తగ్గిపోవడంతో విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలు విమానయాన సంస్థలు విమానాల రద్దును ప్రకటించాయి. మరికొన్ని ఆలస్యంగా నడవనున్నట్లు తెలిపాయి. పొగమంచు నేపథ్యంలో వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. శుక్రవారం తెల్లవారుజామున ఢిల్లీలో గాలి నాణ్యత సూచీ 369గా నమోదైనట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి తెలిపింది. పొగమంచు విపరీతంగా కురుస్తున్నందున విజిబిలిటీ తగ్గిపోవడంతో విమాన కార్యకలాపాలు ప్రభావితమయ్యాయని ఇండిగో తెలిపింది. ఈ క్రమంలో కొన్ని విమానాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. విమానాల రద్దుతో ప్రభావితమైన ప్రయాణికులు ఆన్లైన్లో రీబుక్ చేసుకోవచ్చని లేదా డబ్బు వాపసు పొందవచ్చని తెలిపింది. పొగమంచు వల్ల వారణాసి, ఉదర్పూర్, జమ్మూ, విశాఖపట్నం, జైసల్మేర్లకు విమాన సర్వీసులు నెమ్మదిగా సాగుతున్నట్లు తెలిపింది. ఈ క్రమంలో హైదరాబాద్, గువాహటి విమాన షెడ్యూల్లు కూడా. ప్రభావితం అయ్యాయని వెల్లడించింది. ఇక, ఎయిరిండియా కూడా ఇలాంటి ప్రకటనే చేసింది. ఢిల్లీతో పాటు ఉత్తర భారతంలోని కొన్ని ప్రాంతాల్లో దట్టమైన పొగ మంచు, తక్కువ విజిబిలిటీ వల్ల పలు విమానాలు రద్దయ్యాయని, మరికొన్ని ఆలస్యమవుతాయని తెలిపింది. మరోవైపు, హైదరాబాద్ను కూడా పొగమంచు కమ్మేసింది. దీంతో ఇక్కడినుంచి పలు ప్రాంతాలకు వెళ్లాల్సిన విమానాలు రద్దయ్యాయి.



# దుష్పరిపాలనకు కేంద్రంగా మధ్యప్రదేశ్ : రాహుల్

కలుషిత నీరు తాగి మధ్య ప్రదేశ్లోని ఇండోర్ నగరంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం ఆందోళన రేకెత్తిస్తోంది. ఈ ఘటనపై తాజాగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. అక్కడి ప్రభుత్వం నీరు కాకుండా... విషాన్ని పంపిణీ చేస్తోందని మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ఎక్స్లో పోస్టు పెట్టారు. 'రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం పట్టించుకోకుండా కుంభకర్ణుడిలా నిద్రపోతోందని రాహుల్ విమర్శించారు. కలుషిత నీరు తాగడం వల్ల చాలా మంది ఇళ్లలో విషాదం నెలకొంది.. పేదలు నిస్సహాయ స్థితిలో ఉన్నారని అన్నారు. దీనికి తోడు అధికార భాజపా నేతలు నిర్లక్ష్యపు ప్రకటనలు చేయడాన్ని తప్పుబట్టారు. బాధిత కుటుంబాలకు ఓదార్పు ఇవ్వకుండా ఆహంకారంతో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. 'మురికిగా, దుర్వాసన వస్తోన్న నీటి గురించి గతంలో ప్రజలు. పదే పదే ఫిర్యాదు చేసినా ప్రభుత్వం ఎందుకు పట్టించుకోలేదు, తాగే నీటిలో మురుగునీరు ఎలా కలిసింది. వెంటనే నీటి సరఫరా ఎందుకు ఆపలేదు? బాధ్యులైన అధికారులపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారు?” అని రాహుల్ ప్రశ్నించారు. పరిశుభ్రమైన నీరు పొందడం. ప్రజల హక్కు అని అన్నారు. ఈ హక్కును కాలరాసిన బాజపా ప్రభుత్వమే దీనికి పూర్తి బాధ్యత వహించాలన్నారు. ఇండోర్ ఘటనలో కీలక విషయం దుష్పరిపాలనకు మధ్యప్రదేశ్ కేంద్రంగా మారిందని విమర్శించారు. మొన్నటి వరకు దగ్గు మందు. కారణంగా, ఆ తర్వాత ప్రభుత్వాస్పత్రుల్లో ఎలుకల వల్ల పిల్లలు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇప్పుడు కలుషిత నీరు కారణంగా మృతి చెందుతున్నారన్నారు. ఇలా ఎప్పుడు పేదలు మరణించినా.. మోదీజీ మాత్రం మౌనంగానే ఉంటారని విమర్శించారు. ఇక ఓ మరుగుదొడ్డి వద్ద మంచినీటి పైపులైన్ లీకేజీ వల్లే ఈ మరణాలు చోటుచేసుకుంటున్నాయని నగర మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తాజాగా తెలిపారు. ఈ కలుషిత నీరు తాగి ఇప్పటివరకు 10 మంది మృతి చెందారని ఇండోర్ మేయర్ పుష్యమిత్ర భార్గవ వెల్లడించారు.



## మోదీ, ట్రంప్ మధ్య వ్యక్తిగత విభేదాలు

**అమెరికా కాంగ్రెస్ సభ్యుడు సుహాస్ సుబ్రమణ్యం ఆందోళన**

రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్.. భారత్‌తో అనుసరిస్తున్న విధానాలను అమెరికా కాంగ్రెస్ సభ్యుడు సుహాస్ సుబ్రమణ్యం తప్పుబట్టారు. ట్రంప్ తన చర్యలతో భారత్, అమెరికాల మధ్య సంబంధాలను పూర్తిగా దెబ్బతీశారని ఆరోపించారు. ఇది ఇరుదేశాల ఆర్థిక, వ్యూహాత్మక ప్రయోజనాలకు ప్రమాదకరమని హెచ్చరించారు. డెమోక్రటిక్ నేత సుబ్రమణ్యం ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. తన తొలివిడత పాలనలో తీసుకున్న చర్యలకు పూర్తి వ్యతిరేకంగా ఇప్పుడు వ్యవహరిస్తున్నారు. తొలిసారి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు భారత ప్రధాని మోదీతో సంబంధాలను బలోపేతం చేశారు. ఇప్పుడు మోదీతో ఆయనకు వ్యక్తిగత విభేదాలు ఉన్నట్లుగా కన్పిస్తోంది. దానివల్ల చాలా ఏళ్లుగా బలంగా ఉన్న ఇరుదేశాల సంబంధాలను ఆయన చెడగొట్టుకుంటున్నారు. ఇది ఇరుదేశాలకు మంచిది కాదు. అని ఆయన అన్నారు. భారత్‌తో సంబంధాలను బలోపేతం చేసుకోవడం అమెరికాకు చాలా ముఖ్యమని, ముఖ్యంగా చైనా ఆధిపత్యాన్ని ఎదుర్కోవడానికి ఇది సాయపడుతుందని అన్నారు. ట్రంప్ విధించిన సుంకాలు ఇరుదేశాల మధ్య ఆర్థిక సంబంధాలను తీవ్రంగా దెబ్బతీశాయని సుబ్రమణ్యం అభిప్రాయపడ్డారు. అమెరికా కాంగ్రెస్‌లో ఉభయపక్షాలు భారత్‌తో సంబంధాలకు కట్టుబడి ఉన్నాయన్నారు. ప్రస్తుతం అమెరికా విదేశాంగ విధానం దెబ్బతిందని.. ఇది తనను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందన్నారు. అన్ని యుద్ధాలను ముగిస్తామంటూ ట్రంప్ అధికారంలోకి వచ్చారని.. కానీ దానికి పూర్తి విరుద్ధంగా ఆయన వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

## నేను ఆరోగ్యంగానే ఉన్నా

**అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పష్టీకరణ**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాను ఆరోగ్యంగా, బలంగా ఉన్నానని ఒక ప్రసిద్ధ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. గత అక్టోబరులో తాను వాల్టర్ రీడ్ జాతీయ సైనిక వైద్య కేంద్రాన్ని సందర్శించినప్పుడు గుండెకు సీటీ స్కాన్ చేయించుకొని పొరపాటు చేశానని ఆయన వెల్లడించారు. ఆ పరీక్ష ప్రజల్లో తన ఆరోగ్యంపై అనుమానాలకు దారితీసిందన్నారు. గత నెలలో ట్రంప్ వ్యక్తిగత వైద్యుడు ఆయన ఆరోగ్య పరిస్థితి పై సమాచారం విడుదల చేశారు.



ఎక్కువ వయసు కలిగిన వారు ఆనారోగ్య నిరోధక చర్యల్లో భాగంగా వేయించుకోవాల్సిన ఇమేజింగ్ (చిత్రం తీసే) పరీక్షల్ని ట్రంప్ చేయించుకున్నారని వైద్యుడు అన్నారు. తాను ఎంఆర్ఐ పరీక్ష చేయించుకున్నట్లు ట్రంప్ మొదట ప్రకటించారు. తన శరీరంలోని ఏ భాగంపై ఆ పరీక్ష జరిపారో తెలియదని అప్పట్లో ఆయన అన్నారు. హృద్రోగ సమస్యలేవీ లేవని రూఢి చేసుకునేందుకు సీటీ స్కాన్ లేదా ఎమ్ఆర్ఐ చేయించుకోవాలని తాను ట్రంప్ నకు సలహా ఇచ్చినట్లు ఆయన వ్యక్తిగత వైద్యుడు నేవీ కెప్టెన్ సీన్ బార్బెల్లా తాజాగా వెల్లడించారు. అధ్యక్షుని గుండెకు జరిపిన పరీక్షల్లో ఆయనకు ఎలాంటి అనారోగ్యమూ లేదని స్పష్టమైందని వెల్లడించారు.

# తైవాన్ జలసంధి చుట్టూ చైనా యుద్ధ విన్యాసాలు

## ఆందోళనలో అమెరికా

తైవాన్ విషయంలో చైనా అనుసరిస్తున్న విధానాలపై అమెరికా ఆందోళన వ్యక్తం చేసింది. ఇటీవల తైవాన్ జలసంధి చుట్టూ చైనా భారీగా యుద్ధ విన్యాసాలు చేయడం. తీవ్ర ఆందోళన కలిగించిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాల పైనే తాజాగా అమెరికా విదేశాంగశాఖ స్పందించింది. తైవాన్ చుట్టూ చైనా సైనిక విన్యాసాలు, బెదిరింపులకు పాల్పడటం ఈ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తతలు పెంచుతాయి. బీజింగ్ సంయమనం పాటించాలని, తైవాన్‌పై సైనిక ఒత్తిడిని ఆపాలని కోరుతున్నాం. దౌత్యమార్గాలతో ఈ సమస్యను పరిష్కరించుకుంటారని ఆశిస్తున్నాం అని విదేశాంగశాఖ ప్రతినిధి టామీ పిగోట్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తైవాన్ జలసంధి. చుట్టూ శాంతి, స్థిరత్వానికి యూఎస్ మద్దతిస్తోందన్నారు. ఏకపక్షంగా బలవంతపు చర్యలను, బెదిరింపులను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ వారం ప్రారంభంలో తైవాన్ చుట్టూ చైనా భారీగా నౌక, వైమానిక దళాల విన్యాసాలు చేసింది. రెండు రోజుల్లో బీజింగ్ తమ ద్వీపదేశం చుట్టూ 130



యుద్ధ విమానాలు, 14 యుద్ధ నౌకలను మోహరించిందని తైపీ రక్షణశాఖ పేర్కొంది. వీటిని తీవ్రంగా ఖండించింది. ఇక, కొత్త సంవత్సరం వేళ జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో తైవాన్ను తిరిగి తీసుకొనే ప్రక్రియ ఆగేది కాదని చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ చేసిన వ్యాఖ్యలు ఉద్రిక్తతలను మరింత పెంచాయి. అయితే, చైనా విస్తరణవాదం నుంచి తమ దేశాన్ని రక్షించుకుంటామని తైవాన్ అధ్యక్షుడు లైచింగ్ తెలిపారు.

# ఉత్తర కొరియా కాబోయే చీఫ్ కిమ్ కూతురే

### ఆ దేశ నిఘా వర్గాల అంచనా



ఉత్తరకొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ కుమార్తె కిమ్-జు-యే మళ్లీ బహిరంగంగా కనిపించింది. తల్లిదండ్రులతో కలిసి దేశ మాజీ నేతల స్మారక ప్రదేశం (కుముసన్ స్మారకాన్ని ఆమె సందర్శించింది. గత మూడేళ్ల నుంచి తండ్రి కిమ్ జోంగ్ ఉన్ తో పాటు జు-యే పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటోంది. కిమ్ తన కుమార్తెను అధికారిక పర్యటనలకు తీసుకువెళు తుండటంతో.. భవిష్యత్తులో అధికారిక పగ్గాలు ఆమెకే అందించనున్నట్లు సంకేతాలను పంపుతున్నారని దక్షిణ కొరియా నిఘా వర్గాలు భావిస్తున్నాయి. ఈ విషయాన్ని కిమ్ త్వరలో ప్రకటించే అవకాశం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని దేశ మాజీ నాయకులకు నివాళు లు అర్పించిన ఈ కార్యక్రమానికి కిమ్ తో పాటు అతని భార్య రి సోల్ జ. కుమార్తె కిమ్-జు-యే, ఇతర సీనియర్ అధికారులు హాజరయ్యారు. గతేడాది కిమ్ చైనాకు అధికారిక పర్యటనకు వెళ్లిన సమయంలోనూ కిమ్-జు-యే ఆయనతో ఉంది.

**వారసత్వ సంకేతాలు..**

మొదటిసారిగా 2022లో కిమ్ తన కుమార్తె కిమ్-జు-యేను ప్రపంచానికి పరిచయం చేశారు. 2023లో మిలిటరీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్యాంగ్యాంగ్లో మరోసారి కనిపించింది. నాటినుంచి పలు అధికారిక కార్యక్రమాలకు కూడా హాజరవుతోంది. ఇవన్నీ ఆమె. కిమ్ వారసురాలన్న వార్తలకు బలం చేకూరుస్తున్నాయి. కాగా దక్షిణకొరియా నిఘా వర్గాల ప్రకారం కిమ్కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రెండో సంతానంగా పుట్టిన కుమార్తె కిమ్-ఆ-యే అధికారాన్ని చేపట్టే అవకాశం ఉందని స్థానిక అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. కిమ్ కూడా వంశపారంపర్యంగానే అధికారానికి వచ్చారు. తండ్రి కిమ్ జోంగ్-2 2011లో మరణానంతరం ఈయన పగ్గాలు చేపట్టారు.

# రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నివాసంపై దాడి నిజమే

### ఆధారాలను అమెరికాకు అందజేసిన రష్యా

యుద్ధం ముగించేందుకు ప్రయత్నాలు జరుగుతుండగా.. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇల్లే లక్ష్యంగా డ్రోన్ దాడులు జరగడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఉక్రెయిన్ దళాలు ఈ దాడికి పాల్పడ్డాయంటూ రష్యా ఆరోపించిన సంగతి తెలిసిందే. వీటిని పలు దేశాలు ఖండిస్తున్న నేపథ్యంలో... దాడి నిజమేనని నిరూపించుకునే పనిలో పడింది రష్యా. ఇందులోభాగంగా దాడికి సంబంధించి లభ్యమైన కొన్ని ఆధారాలను అమెరికాకు అందజేసింది ఈ మేరకు ఆ దేశ రక్షణ మంత్రిత్వశాఖ ఓ వీడియో విడుదల చేసింది.



రష్యా సైనిక నిఘా సంస్థ అధిపతి అడ్మిరల్ ఇగోర్ కోస్త్యకోవ్ మాస్కోలోని యూఎస్ మిలిటరీ అటాచ్ అధికారులతో భేటీ అయ్యారు. ఈసందర్భంగా కోస్త్యకోవ్ మాట్లాడుతూ... దాడికి ఉపయోగించిన మానవరహిత విమానం శకలాలను తాము కనుగొన్నట్లు తెలిపారు. తమ దళాలు కూల్చివేసిన అనేక డ్రోన్లలోని నేవిగేషన్ వ్యవస్థలు చెక్కుచెదరకుండా ఉన్నాయన్నారు. వీటిని తమ ప్రత్యేక నిపుణులతో పరీక్షించగా.. డ్రోన్ల దాడి లక్ష్యం నోవ్ గోరోడ్ ప్రాంతంలోని పుతిన్ (Pain) నివాసమేనని నిర్ధరణ అయ్యిందన్నారు. ఈ సందర్భంగా వివరాలన్నింటినీ కోస్త్యకోవ్ అమెరికా (USA)కు అప్పగించారు.

ఇక, ఉక్రెయిన్ ఈ దాడి చేసిందంటూ రష్యా చేస్తున్న ఆరోపణలను ఆ దేశం ఖండించింది. నాటో దేశాలు కూడా మాస్కోకు మద్దతివ్వలేదు. మరోవైపు కీవ్ దాడికి యత్నించినట్లు ఎలాంటి ఆధారాలు లేవని యూఎస్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ కూడా వెల్లడించినట్లు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ క్రమంలో దాడి ఆధారాలను రష్యా అమెరికాకు ఇవ్వడం గమనార్హం.



# కోహ్లి ముంగిట మూడు రికార్డులు

టీమిండియా స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లికి 2025 సంవత్సరం చిరస్మరణీయమైనది. ఐపీఎల్ సీజన్18లో అతను అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. అలానే ఐపీఎల్ కప్‌ను ముద్దాడాలనే ఆర్సీబీ ఏళ్ల కల.. 2025లో నెరవేరింది. కోహ్లి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆర్సీబీ తమ తొలి టైటిల్‌ను గెలుచుకుంది. అలానే భారత్ తరఫున వన్డేలలో అత్యధిక పరుగులు కూడా చేసి, ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో బ్యాటర్లలో రెండవ స్థానంలో విరాట్ నిలిచాడు. అంతేకాకుండా, వన్డేలలో రెండవ అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. ఒకే అంతర్జాతీయ ఫార్మాట్‌లో అత్యధిక సెంచరీల రికార్డును బద్దలు కొట్టడం వంటి ఘనతలు కూడా 2025 ఏడాదిలో సాధించాడు. అలానే 2026 సంవత్సరంలో విరాట్ కోహ్లిని మూడు రికార్డులు ఊరిస్తున్నాయి.

**రికార్డ్-1**

విరాట్ కోహ్లీ ఐపీఎల్‌లో మరో 339 పరుగులు చేస్తే.. ఈ లీగ్‌లో 9,000 పరుగులు చేసిన తొలి బ్యాటర్‌గా రికార్డ్ క్రియేట్ చేస్తాడు. ప్రస్తుతం విరాట్ ఐపీఎల్ లో 259 ఇన్నింగ్స్‌ల్లో 8,681 పరుగులు చేసి.. టాప్ స్కోరర్‌గా కొనసాగుతున్నాడు. అతడి తర్వాత రోహిత్ శర్మ 267 ఇన్నింగ్స్‌ల్లో 7,046 రన్స్‌తో రెండో స్థానంలో ఉన్నాడు. విరాట్ తన ఐపీఎల్ కెరీర్‌లో మొదటినుంచి ఇప్పటి వరకు కేవలం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకే ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. పలు సీజన్లలో కెప్టెన్ గా కూడా వ్యవహరించాడు.

**రికార్డ్-2**

న్యూజిలాండ్, టీమిండియా మధ్య జనవరి 11న తొలి వన్డే ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లి ఓ రికార్డ్ సృష్టించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ప్రస్తుతం విరాట్ అంతర్జాతీయ క్రికెట్‌లో మూడు ఫార్మాట్లలో కలిపి 623 ఇన్నింగ్స్‌ల్లో 27,975 పరుగులు చేశాడు. మరో 42 పరుగులు చేస్తే.. శ్రీలంక మాజీ క్రికెటర్ కుమార సంగక్కరను (28,016 పరుగులు) అధిగమిస్తాడు. అప్పుడు కోహ్లి ఇంటర్నేషనల్ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన రెండో బ్యాటర్‌గా రికార్డ్ సృష్టిస్తాడు. తొలి స్థానంలో సచిన్ టెండుల్కర్ 34,357 పరుగులతో టాప్ లో ఉన్నారు

**రికార్డ్-3**

విరాట్ కోహ్లీ వన్డేల్లో మరో 443 పరుగులు చేస్తే 15,000 మైలురాయిని చేరుకుంటాడు. ప్రస్తుతం అతను 296 ఇన్నింగ్స్‌ల్లో 14,557 పరుగులు చేశాడు. ఈ జాబితాలో క్రికెట్ దిగ్గజం సచిన్ టెండుల్కర్ టాప్ ప్లేస్ లో ఉన్నారు. ఆయన 452 ఇన్నింగ్స్‌ల్లో 18,426 పరుగులు చేశాడు. ఇప్పటివరకు సచిన్ ఒక్కరే వన్డేల్లో 15,000కు పైగా పరుగులు చేశారు. మరో 443 పరుగులు చేస్తే ఆ మార్కు దాటిన రెండో ఆటగాడిగా కోహ్లి నిలుస్తాడు.

# ఐపీఎల్‌లో బంగ్లా ఆటగాళ్లు..

*మా చేతుల్లో లేని వ్యవహారం: బీసీసీఐ*

త్వరలోనే ప్రారంభం కానున్న ఐపీఎల్– 2026 లీగ్‌లోకి బంగ్లాదేశ్ ఆటగాళ్లను తీసుకోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్న విషయం తెలిసిందే. బంగ్లా ప్లేయర్లపై నిషేధం విధించాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ వివాదంపై ఎట్టకేలకు బీసీసీఐ వర్గాలు స్పందించాయి. బంగ్లాదేశ్ ఆటగాళ్లను ఐపీఎల్‌లో ఆడకుండా నిరోధించడంపై తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గనిర్దేశకాలు రాలేదని పేర్కొన్నాయి. ఇది తమ చేతుల్లో లేని వ్యవహారమని, దీనిపై ఇంతకు మించి మాట్లాడటానికి ఏమీ లేదని వెల్లడించాయి.

**ముస్తాఫిజుర్ ఆడతాడా?**

ఐపీఎల్ 2026 మినీ వేలం డిసెంబర్ 15న అబుదాబీలో జరిగింది. ఇందులో బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను కోల్‌కతా నైట్‌రైడర్స్ రూ.9.20 కోట్లకు కొనుగోలు చేసింది. దీంతో ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ధర పలికిన బంగ్లాదేశ్ ఆటగాడిగా ముస్తాఫిజుర్ రికార్డు సృష్టించాడు. అయితే




బంగ్లాదేశ్‌లో రాజకీయ అస్థిరత వేళ.. మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయి. దీంతో అతడిని ఐపీఎల్ నుంచి నిషేధించాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి.

ముస్తాఫిజుర్ ఇప్పటివరకు ఐపీఎల్‌లో 60 మ్యాచ్‌ల్లో 65 వికెట్లు పడగొట్టాడు. 8.13 ఎకానమీతో సమర్థవంతమైన బౌలర్‌గా పేరు తెచ్చుకున్నాడు. 2016లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో ఐపీఎల్ అరంగేట్రం చేసిన అతడు, అనంతరం ముంబై ఇండియన్స్ (2018), రాజస్థాన్ రాయల్స్ (2021), ఢిల్లీ క్యాపిటల్స్ (2022–23), చెన్నై సూపర్‌కింగ్స్ (2024) జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. గత సీజన్‌లో ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించలేకపోవడంతో సీఎస్కే అతడిని విడుదల చేసింది. అనంతరం ఆస్ట్రేలియా ఆటగాడు జేక్ ఫ్రేజర్ మెక్‌గర్క్‌కు గాయమవడంతో రీప్లేస్‌మెంట్‌గా మళ్లీ ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులోకి వచ్చాడు.

**షారుక్‌ఖాన్‌పై విమర్శలు..**

ముస్తాఫిజుర్‌ను కొనుగోలు చేయడంపై ఆధ్యాత్మిక గురువు దేవకీనందన్ ఠాకూర్.. కేకేఆర్ యాజమాన్యాన్ని, సహ యజమాని బాలీవుడ్ నటుడు షారుక్ ఖాన్‌ను విమర్శించారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో బంగ్లాదేశ్ ఆటగాడిని ఐపీఎల్‌లోకి తీసుకోవడం సనాతన ధర్మాన్ని అనుసరించే వారికి బాధ కలిగించిందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై రాజకీయ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే చాలా మంది నేతలు క్రీడలను రాజకీయ, దౌత్య అంశాల నుంచి వేరు చేయాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## అవమానాలు భరించలేకనే.. తప్పుకున్నా



పాకిస్థాన్ దేశ పరిస్థితిలాగానే అక్కడి క్రికెట్‌లో కూడా అనిశ్చితి పరిస్థితులే కనిపిస్తాయి. పాక్ జట్టు హెడ్‌కోచ్‌లు ఎప్పటికప్పుడు తరచూ మారుతూ ఉంటారు. సెలక్టర్లు, మెంటార్లు, సహాయక సిబ్బంది విషయంలో కూడా తరచూ మార్పులు జరుగుతుంటాయి. తాజాగా టెస్టు హెడ్‌కోచ్ అజహర్ మహమ్మద్‌కు పాక్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఉద్వాసన పలికేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తీరుపై ఆ జట్టు మాజీ టెస్ట్ కోచ్, ఆస్ట్రేలియా దిగ్గజ క్రికెటర్ జేసన్ గిలెస్పీ తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు

జేసన్ గిలెస్పీ 2024లో పాకిస్థాన్ కోచ్‌గా పనిచేసిన విషయం తెలిసిందే. అయితే అతడు అకస్మాత్తుగా తన పదవి నుంచి తప్పుకున్నాడు. దానికి గల కారణాన్ని తాజాగా సోషల్ మీడియా వేదికగా వెల్లడించాడు. తనకు అవమానాలు ఎదురైనందునే తప్పుకోవాల్సి వచ్చిందని తెలిపాడు. అప్పుడు నేను పాకిస్థాన్ టెస్ట్ జట్టుకు కోచ్‌గా వ్యవహరిస్తున్నా. హెడ్ కోచ్‌నైన నాకు ఏమాత్రం సమాచారం ఇవ్వకుండానే పాకిస్థాన్ క్రికెట్ బోర్డ్ మా సీనియర్ అసిస్టెంట్ కోచ్‌లను తొలగించింది. అది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదనిపించింది. అలాగే ఇలాంటి మరిన్ని అవమానకర పరిస్థితులు ఎదురయ్యాయని గిలెస్పీ వివరించాడు. స్థానికంగా ఉండి కూడా ఆటగాళ్ల మధ్య సన్నిహిత సంబంధాల కోసం ఏర్పాటు చేసిన కనెక్షన్ క్యాంప్ నకు హాజరుకాని పీసీబీ చీఫ్ నఖ్వీ గురించి కూడా గిలెస్పీ మాట్లాడాడు. దక్షిణాఫ్రికా నుంచి గ్యారీ కిరిస్టెన్, ఆస్ట్రేలియా నుంచి నేను విమానంలో పాకిస్థాన్‌కు వెళ్లాం. కానీ నఖ్వీ.. లాహోర్‌లోనే ఉండి కూడా హాజరు కాలేదన్నాడు. 'గ్యారీ కిరిస్టెన్.. కనెక్షన్ క్యాంప్ గురించి గొప్ప ఆలోచనలతో ముందుకువచ్చాడు. పాకిస్థాన్ క్రికెట్ జట్టులోని ప్రతిఒక్కరూ ఆ సమావేశంలో తమ అనుభవాలను పంచుకున్నారు. నేను ఆస్ట్రేలియా నుంచి, గ్యారీ దక్షిణాఫ్రికా నుంచి విమానంలో వచ్చాం. కానీ పీసీబీ ఛైర్మన్ నఖ్వీ మాత్రం జూమ్ ద్వారా మాతో మాట్లాడాడు' అని గిలెస్పీ తప్పుబట్టాడు. అతడు లాహోర్‌లోనే ఉన్నాడు.. కానీ రాలేదు. ఛైర్మన్ ఆ సమావేశానికి రావడానికి 20 నిమిషాలు కూడా డ్రైవ్ చేయలేకపోయాడని మా ఇద్దరికీ అనిపించింది. అది కొంచెం అసాధారణం' అని జేసన్ గిలెస్పీ విమర్శించాడు.

# జాతి వివక్ష ఎదుర్కొన్నా..

- క్రికెట్‌కు గుడ్ బై చెప్పిన ఉస్మాన్ ఖవాజా



ఆస్ట్రేలియా క్రికెటర్ ఉస్మాన్ ఖవాజా అంతర్జాతీయ క్రికెట్‌కు తన రిటైర్మెంట్ ప్రకటించాడు. యాషెస్ సిరీస్‌లో భాగంగ జరగనున్న సిడ్నీ టెస్ట్ తనకు ఆఖరు మ్యాచ్ కానుందని వెల్లడించాడు. అలాగే తన కెరీర్లో తాను ఎదుర్కొన్న జాతి వివక్ష గురించి మాట్లాడాడు. నేను ఎప్పుడూ కొంచెం భిన్నంగానే ఉన్నాను. ఇప్పుడు కూడా. నేను నల్లజాతి క్రికెటర్‌ను. ఆస్ట్రేలియా తరఫున క్రికెట్ ఆడలేను అని నన్ను అన్నారు. కానీ నేను సాధించాను. అది నాకు గర్వకారణం. ఆనందదాయకం. అయితే జట్టులోని పలువురు సభ్యులు, మీడియా వారు నాతో వివక్షపూరితంగా వ్యవహరించారు. క్రికెట్‌పై నాకున్న అంకితభావం, నిబద్ధతను శంకించారు. నా సన్నద్ధతను ప్రశ్నించారు' అని ఉస్మాన్ ఖవాజా ఆవేదన వ్యక్తం చేశాడు. జట్టులోని ఇతర ఆటగాళ్లు గాయపడితే వారికి సానుభూతి దక్కేది. అయ్యో పాపం.... జోష్ హేజిల్ వుడ్, అయ్యో పాపం.. నాథన్ లైయన్ అనేవారు. కానీ నేను గాయపడితే మాత్రం నాదే తప్పన్నట్లుగా చూసేవారు. ఇతర క్రికెటర్లు ముందు రోజు రాత్రి తప్ప తాగి గాయపడినా వారిని ఒక్క మాట కూడా అనేవారు కాదు. కానీ నా విషయంలోనే పరిస్థితి భిన్నంగా ఉండేది. ఈ విషయంలోనే నేను ఎక్కువ బాధను అనుభవించానని ఉస్మాన్ ఖవాజా వివరించాడు.

పాకిస్థాన్లో జన్మించిన ఉస్మాన్ ఖవాజా.. ఆస్ట్రేలియాకు ప్రాతినిధ్యం వహించిన మొదటి ముస్లిం క్రికెటర్ అయ్యాడు. కెరీర్ ప్రారంభంలో జట్టుకు ఎంపిక విషయంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. తర్వాత ఓపెనర్‌గా స్థానం పదిలం చేసుకున్నాడు. అలాగే 2023లో ఆస్ట్రేలియా ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ గెలిచిన జట్టులో కీలక పాత్ర పోషించాడు.

ఉస్మాన్ ఖవాజా ప్రస్తుత యాషెస్ సిరీస్‌లో మెల్బోర్న్ టెస్ట్‌లో 82 పరుగులు చేశాడు. 2025లో అతడు 18 ఇన్నింగ్స్‌ల్లో 614 పరుగులు చేశాడు. ఆ సంవత్సరం ప్రారంభంలో శ్రీలంకతో జరిగిన మ్యాచ్ లో 232 పరుగులు చేశాడు. ఖవాజా తన కెరీర్లో ఇప్పటివరకు 87 టెస్టు, 40 వన్డేలు, 9 టీ20లు ఆడాడు. మొత్తంగా 8,001 అంతర్జాతీయ పరుగులు చేశాడు.

## ఐదేళ్ల తరువాత ఆస్ట్రేలియా ఓపెన్లో వీనస్



ఏడుసార్లు గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిళ్లు గెలుచుకున్న అమెరికా వెటరన్ టెన్నిస్ స్టార్ వీనస్ విలియమ్స్ ఐదేళ్ల తర్వాత ఆస్ట్రేలియా ఓపెన్లో పునరాగమనం చేస్తున్నారు. జనవరిలో ప్రారంభం కానున్న ఈ టోర్నీ కోసం ఆమెకు ఇప్పటికే వైల్డ్‌కార్డ్ ఎంట్రీ లభించింది. ఏడుసార్లు గ్రాండ్ స్లామ్ సింగిల్స్ ఛాంపియన్ అయిన ఆమె.. కొన్ని రోజుల క్రితమే వివాహబంధంలోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. డెన్మార్క్‌కు చెందిన మోడల్, యాక్టర్ ఆండ్రియా ప్రెటిని ఆమె పెళ్లి చేసుకున్నారు.

జనవరి 18 నుంచి మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియన్ ఓపెన్ ప్రారంభం కానుంది. ఈ ఓపెన్ మెయిన్ డ్రాలో తలపడనున్న పెద్ద వయస్కురాలు వీనసే కావడం గమనార్హం. ఇప్పుడు ఆమె వయసు 46 ఏళ్లు. అంతకుముందు ఈ రికార్డు జపాన్‌కు చెందిన కిమికో డేట్ పేరిట ఉండేది. ఆస్ట్రేలియా ఓపెన్ లో పునరాగమనం చేయడంపై సంతోషంగా ఉన్నాను. ఇక్కడ తనకు ఎన్నో జ్ఞాపకాలు ఉన్నాయని వీనస్ సంతోషం వ్యక్తంచేశారు. 1998లో ఈ టోర్నమెంట్లో ఆమె అరంగేట్రం చేశారు. ఈ టోర్నీలో రెండుసార్లు సింగిల్స్ ఫైనల్‌కు చేరిన ఆమె.. 2003, 2017లో తన చెల్లెలు సెరెనా విలియమ్స్ చేతిలో ఓడి, రన్నరప్ గా నిలిచారు. అలాగే నాలుగు సార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ డబుల్స్ ఛాంపియన్‌గా నిలిచారు. వీనస్ ఐదు సార్లు వింబుల్డన్, రెండు సార్లు యూఎస్ ఓపెన్ సింగిల్స్ టైటిళ్లు సాధించారు.

# రేపే 'మన శంకర వరప్రసాద్ గారు' ట్రైలర్!

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్లో రాబోతున్న కామెడీ యాక్షన్ ఎంటర్టైనర్ 'మన శంకర వరప్రసాద్ గారు'. నయనతార కథానాయిక. వెంకటేష్ కీలక పాత్ర పోషిస్తున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదల కానున్న ఈ సినిమాకు సంబంధించి ప్రచార కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. తాజాగా జనవరి 4న ఈ సినిమా ట్రైలర్ విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్లో మెగాస్టార్ పూర్తి యాక్షన్ మోడ్‌లో కనిపించారు. మోకాలిపై కూర్చొని తుపాకీ పేలుస్తున్న స్టిల్స్ అభిమానులతో విజిల్స్ వేయించేలా ఉంది. ఇక ఆ యాక్షన్ ఎపిసోడ్‌కు థియేటర్ దద్దరిల్లాల్సిందే అనిపిస్తోంది.




### రూల్స్ బ్రేక్ చేసిన నయన్..

అగ్ర కథానాయిక నయనతార గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ప్రొఫెషన్ విషయంలో ఆమె రూల్ అంటే రూలే. ఏ సినిమా ఒప్పుకొన్నా, ప్రచారానికి తాను రానని ముందే చెబుతారని టాక్. గత కొంతకాలంగా ఆమె నటించిన సినిమాలు చూస్తే. ఈ విషయం ఇట్టే అర్థమవుతుంది. చాలా అరుదుగా భర్త విఘ్నేశ్ కోసం ఒకట్రెండు సార్లు వచ్చారు. తాను హీరోయిన్‌గా చేసిన చాలా సినిమాలకు రాలేదు. ఇప్పుడు 'మన శంకర వరప్రసాద్ గారు' కోసం ఆ రూల్‌ని బ్రేక్ చేశారు. తాజాగా ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది.. ఆమే స్వయంగా వచ్చి మూవీ ప్రమోషన్స్ గురించి దర్శకుడు అనిల్ రావిపూడిని అడగటం.. ఆయన కళ్లు తిరిగి పడిపోవడం నవ్వులు పూయిస్తోంది.

'సంక్రాంతికి వస్తున్నాం' మూవీకి వెంకటేష్‌తో తోనే రీల్స్ చేయించిన అనిల్.. నయనతారకు ఏం చెప్పి ఒప్పించారో తెలియదు. అనిల్ దగ్గర ఏదో మంత్రదండం ఉందంటూ కామెంట్లు వినిపిస్తున్నాయి. ఈ సినిమాకు సరికొత్తగా ప్రచారం చేయాలని భావిస్తున్నారు. ప్రస్తుతం వెంకటేష్ అమెరికాలో ఉన్నారు. ఆయన రాగానే, మూవీ ప్రీ-రిలీజ్ ఈవెంట్‌కు సంబంధించిన తేదీని కూడా ప్రకటిస్తారు.

## మాస్ మహరాజా మాస్ సాంగ్



మాస్ మహరాజా రవితేజ తాజా చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' నుండి అవుట్ అండ్ అవుట్ మాస్ సాంగ్ 'వామ్మో... వాయ్యో...' వచ్చేసింది. ఆషికా రంగనాథ్, డింపుల్ హయతీ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించాడు. హీరోతో కలిసి ఇద్దరూ హీరోయిన్లు వేస్తున్న మాస్ స్టెప్స్ తో సాగిన ఈ పాటను చూస్తుంటే ప్రీ క్లయిమాక్స్ సాంగ్ అనే విషయం అర్థమైపోతోంది.

హీరోహీరోయిన్లు కలర్ ఫుల్ అవుట్ ఫిట్స్‌తో అదరగొట్టమే కాదు... మాస్ ఆడియెన్స్ మెచ్చేలా దరువుకు తగ్గ స్టెప్పులు వేశారు. జానపద గీతాన్ని తలపించేలా దీనిని దేవ్ పవర్ రాయగా, స్వాతిరెడ్డి యు.కె. పాడింది. ఈ పాటకు శేఖర్ మాస్టర్ నృత్య రీతులు సమకూర్చారు. కిశోర్ తిరుమల దర్శకత్వంలో సుధాకర్ చెరుకూరి నిర్మించిన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' ఈ నెల 13న విడుదల కాబోతోంది.

## రామ్ వద్దనుకున్న సినిమాల్లో అక్కినేని సోదరులు?



ఓసినిమా కథ హీరోకి నచ్చితే మొదటి చర్చలోనే ఖాయం అయిపోతుంది. కొన్ని సందర్భాల్లో అదే కథ తిరిగి తిరిగి ఎక్కడికో వెళ్తుంది. ఎవరికి రాసి పెట్టి ఉంటే వారి దగ్గరకు చేరుతుంది. అదే కథను తర్వాత అనవసరంగా వదిలేశామే అనుకుని ముందు కాదన్న హీరోలు బాధపడుతుంటారు. ప్రస్తుతం అక్కినేని సోదరులు నాగచైతన్య, అఖిల్ రెండు సినిమాలు చేస్తున్నారు. ఆవి రెండూ రామ్ పోతినేని వద్దనుకున్న సినిమాలు కావటమే ఇక్కడ విశేషం. నాగ్ చైతన్య మిస్టిక్ థ్రిల్లర్ జానర్‌లో ఓ సినిమా చేస్తున్నారు. రూ. 100 కోట్ల బడ్జెట్‌తో భోగవల్లి బాపినీడు నిర్మిస్తున్నారు. కార్తీక్ దండు ఈ చిత్రానికి దర్శకుడు. ఇదే కథ ముందు రామ్ పోతినేని దగ్గరకు వెళ్లిందని తెలిసింది. ఎందుకో అది తనకు నచ్చకో లేక ఆ టైమ్‌లో మరో కథ నచ్చి దీనిని వదులుకోవడమో జరిగిందని తెలిసింది.

ఇక తమ్ముడు అక్కినేని అఖిల్ 'లెనిన్' అనే టైటిల్‌తో తెరకెక్కుతున్న ఓ చిత్రంతో బిజీగా ఉన్నారు. రంగస్థలం జానర్ కథ ఇది. ఈ కథ కూడా ముందు రామ్ దగ్గరకు వెళ్లినట్లు తెలుస్తోంది. కానీ తనకు అలాంటి కథ నప్పదనే ఆలోచనతో రామ్ నో అన్నట్లు తెలుసింది. దాంతో ఈ రెండు కథలు అక్కినేని బ్రదర్స్ దగ్గరకు చేరాయి. ఇప్పుడు ఈ రెండు కథలు హీరోలకు ప్లస్ అవుతాయని హీరోల్లోనూ, మేకర్లలోనూ నమ్మకం వుంది.

## విశాల్ సరసన కయాదు లోహర్?






తమిళంలో మరో ఆసక్తికర కాంబినేషన్ తెరపైకి రాబోతోంది. ప్రముఖ దర్శకుడు సుందర్ సి, హీరో విశాల్ కలయికలో తెరకెక్కనున్న మూడో చిత్రంలో హీరోయిన్‌గా కయాదు లోహర్‌ను ఎంపిక చేసేందుకు చిత్రబృందం సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. ఇంతకుముందు సుందర్-విశాల్ కాంబినేషన్‌లో వచ్చిన 'ఆంబల', 'మదగజరాజా' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ హిట్లుగా నిలిచాయి. ఈ విజయాలతో మూడో సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం దర్శకుడు సుందర్ సి 'మూక్కుత్తి అమ్మన్-2' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మరోవైపు విశాల్ 'మకుటం' సినిమాలో నటిస్తున్నారు. వీరిద్దరూ తమ ప్రస్తుత ప్రాజెక్టులు పూర్తయ్యాక ఈ కొత్త చిత్రాన్ని ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది.

ఇదిలా ఉండగా, సూపర్‌స్టార్ రజనీకాంత్ చిత్రానికి దర్శకత్వం వహించాల్సిన సుందర్ సి వ్యక్తిగత కారణాలతో ఆ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవడం కోలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. అదే సమయంలో విశాల్ చిత్రానికి ఆయన దర్శకత్వం వహించడం ఇండస్ట్రీ వర్గాల్లో ఆసక్తిని రేపుతోంది.

## క్రేజీ కాంబినేషన్‌లో 'ఓఎంజీ 3'



బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్‌తో అమిత్ రాయ్ తెరకెక్కించిన 'ఓ మై గాడ్' ఫ్రాంచైజీసూపర్ డూపర్ హిట్ అయ్యింది. ఇందులో మొదటిదైన 'ఓ.ఎం.జీ.' మూవీ అయితే తెలుగులోనూ 'గోపాల గోపాల' పేరుతో విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. 'ఓ మై గాడ్'కు దక్కిన విజయం కారణంగా ఆ తర్వాత అక్షయ్ కుమార్, అమిత్ రాయ్ 'ఓ.ఎం.జీ. 2' సినిమాను తెరకెక్కించారు. ఇది కూడా విజయవంతమయింది. అప్పటి నుండి అందరూ దీని ఫ్రాంచైజీలో మూడో సినిమా ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తూ ఉన్నారు. వారందరి కోరిక త్వరలోనే తీరబోతోంది.

ప్రస్తుతం 'ఓ.ఎం.జీ 3' ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. దర్శకుడు అమిత్ రాయ్ స్క్రిప్ట్ కు తుదిమెరుగులు దిద్దుతున్నాడని అంటున్నారు. ఈ యేడాది మధ్యలో పట్టాలెక్కబోతున్న ఈ సినిమాలో నాయికగా రాణీ ముఖర్జీని ఎంపిక చేశారన్నది తాజా సమాచారం. ఇప్పటికే రాణీ ముఖర్జీ తనకు యాక్షన్ హీరోయిన్‌గా మంచి పేరు తెచ్చిపెట్టిన 'మర్దానీ' ఫ్రాంచైజీలో మూడో సినిమా చేస్తోంది. అది ఈ ఏడాది ఫిబ్రవరి 27న విడుదల కావాల్సి ఉంది. అలానే షారుఖ్ ఖాన్ నటిస్తున్న 'కింగ్' సినిమాలోనూ రాణీ ముఖర్జీ అతిథి పాత్రలో మెరవబోతోందని సమాచారం. ఈ నేపథ్యంలో ఆమె పూర్తి స్థాయి హీరోయిన్ గా 'ఓఎంజీ 3'లో చేయడంతో సహజంగానే ఆ మూవీపై మరింత క్రేజ్ పెరగడానికి కారణమైంది. మరి ఈ ఫ్రాంచైజీ నుండి వచ్చిన మొదటి రెండు సినిమాలను మించిన విజయాన్ని 'ఓఎంజీ 3' అందుకుంటుందేమో చూడాలి.

## పిల్లలకు మంచి అలవాట్లు మనమే నేర్పించాలి

పిల్లలు తప్పుదారి పట్టకుండా మంచి మార్గంలో నడిపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, కుటుంబంపైనే ఉందని నటి రోహిణి అన్నారు. మాదక ద్రవ్యాలు సహా చెడు అలవాట్లకు వారు బానిసలు కాకుండా చూడాలన్నారు. మనం పాటించే మంచి అలవాట్లను వారికి ముందుగా చెప్పాలన్నారు. తాజాగా ఓ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చిన్నప్పుడు 'యశోద కృష?'లో నటించానని తనని కన్నది తెలుగు తల్లి అయితే, పెంచింది. తమిళ తల్లి అని అన్నారు.

ప్రస్తుతం సమాజంలో యువత మాదక ద్రవ్యాల బారిన పడుతోంది. వాటి నియంత్రణకు పోలీసులు, వివిధ శాఖల అధికారులు పనిచేస్తున్నారు. మనం కూడా మన వంతు బాధ్యత నిర్వర్తించాలి. మన పిల్లల్ని మంచి దారిలో నడిపించాలి. స్నేహితుల మెప్పు కోసం ఇలాంటివి అలవాటు చేసుకోకూడదని చెప్పాలి. మన బిడ్డలో తేడా కనిపిస్తే, గమనించి కూర్చోబెట్టి అన్నీ చెప్పాలి. బట్టలు వేసుకుని, బయటకు వెళ్లాలి.. నగ్నంగా వెళ్లకూడదని చెబుతున్నాం. దాన్ని అలవాటు చేస్తున్నాం. ఇక్కడ అందరం చీరలు కట్టుకుంటున్నాం. లండన్లో షార్ట్స్, స్కర్ట్స్ వేసుకుంటున్నారు. అది వాళ్లకు అలవాటు. మన అలవాట్లు కూడా మనమే మన పిల్లలకు



చెప్పాలి. మా అబ్బాయికి ఇదే విషయం చెబుతుంటాను. చెడు అలవాట్ల వల్ల జరిగే కష్టనష్టాలు పిల్లలకు తెలియజేయాలి. క్లిష్టమైన సమయంలో మనం ఇచ్చే సలహాలు వాళ్లకు ఉపయోగపడతాయి. వాళ్లు చిన్నా, వినకపోయినా, మనం చెప్పాల్సింది చెప్పి తీరాలి. రాబోయే తరాలు బాగుంటేనే భవిష్యత్ బాగుంటుంది. ప్రతి మహిళ చదువుకోవాలి. ఈ సమాజంలో చాలా విషయాలను సరిచేసే శక్తి స్త్రీకి ఉంది. రాబోయే తరాల ఆలోచనలను మార్చగలదు. ఆహెూరాత్రులు ఇంట్లో శ్రమించే మహిళల గురించి మనం పట్టించుకోవాలి. జీతాలు లేని శ్రామికులు మహిళలు. పుట్టుకతోనే శ్రామికులం. అన్నం ఎవరు. వండినా ఉడుకుతుంది కదా! అబ్బాయిలకు కూడా అన్నీ నేర్పండి. బయట అభ్యుదయ భావాలు మాట్లాడుతున్న వాళ్ళు కూడా కొంచెం ఇంట్లో వాళ్ల గురించి కూడా ఆలోచించండి. అందరూ పల్లకి ఎక్కాల్సిన అవసరం లేదు. కలిసి సమానంగా నడిచే సమాజం రావాలి. సమాజంలో మాదక ద్రవ్యాలు వినియోగం పెరిగింది. యువతను పక్క దారి పట్టించే పనిలో భాగంగా ఇలా చేస్తున్నారని రోహిణి ఆవేదన వ్యక్తం చేశారు.